# మన జన ప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక

సంపుటి : 6 సంచిక : 192 పేజీలు : 8 వెల : రూ.2/- శుక్రవారం 07 ఆగస్టు 2026

Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


## కృష్ణా నీటి వాటాలను తేల్చండి




- బోర్డు సమావేశం ఏర్పాటు చేయాలని కోరిన ఏపి

**అమరావతి,మన జనప్రగతి ఆగస్ట్ 06:** కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) ఛైర్మన్‌కు ఏపీ ప్రభుత్వం లేఖ రాసింది. కృష్ణా జలాల అంశంపై చర్చించేందుకు బోర్డు సమావేశం ఏర్పాటు చేయాలని రాష్ట్ర జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కోరారు. శ్రీశైలం, సాగర్‌లో అందుబాటులో ఉన్న నీటిలో ఏపీ,

మిగతా2లో...

## అగ్ని-4 పరీక్ష విజయవంతం



**భువనేశ్వర్,మన జనప్రగతి ఆగస్ట్ 06:** భారత్ మరో కీలక క్షిపణి పరీక్షను విజయవంతంగా పూర్తి చేసింది. అగ్ని-4 బాలిస్టిక్ క్షిపణిని విజయవంతంగా ప్రయోగించింది. ఒడిశాలోని చాందీపూర్ ఇంటిగ్రేటెడ్ పరీక్షా కేంద్రం నుంచి విజయవంతంగా ప్రయోగించినట్లు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ గురువారం (ఆగస్టు 6) వెల్లడించింది ఈ ప్రయోగాన్ని స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్ ఆధ్వర్యంలో

మిగతా2లో...



## స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కండి

**బ్రేక్ ఫాస్ట్ మీట్‌లో మంత్రులకు లోకేశ్ పిలుపు**

**అమరావతి,మన జనప్రగతి ఆగస్ట్ 06:** స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని మంత్రులకు విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. స్థానిక ఎన్నికల్లో కూటమి జయకేతనం ఎగరేసేలా

మిగతా2లో...

# రాజకీయ ముసుగులో రౌడీయిజం చేస్తున్న వైకాపా

● జగన్ అండ్ కోని కంట్రోల్ చేయడం 2 నిముషాల పని ● డీఎస్సీపై కావాలనే నానా యాగీ చేస్తున్నారు ● పొగాకు రైతుల వద్దకు వెళ్లి హంగామా చేశారు ● రైతన్నల పొలాలను ధ్వంసం చేసి..వారిని క్షోభ పెట్టారు ● జగన్ అరాచకాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించాలి ● కేబినేట్‌లో మంత్రులతో సిఎం చంద్రబాబు



**అమరావతి,మన జనప్రగతి ఆగస్ట్ 06:** జగన్ అండ్ కో చేస్తున్న అరాచకాలను కంట్రోల్ చేయడానికి తనకు రెండు నిమిషాలు చాలని సీఎం చంద్రబాబు మంత్రులతో అన్నారు. కానీ రాజకీయ ముసుగులో వారు నేరాలు చేస్తున్నారని ఆగ్రహించారు. డీఎస్సీపై చేస్తున్న రాద్ధాంతాన్ని కూడా అందరూ గమనిస్తున్నారని తెలిపారు. అన్ని విషయాలు డీఎస్సీపై మనం ప్రజలకు వివరించామని అన్నారు. వైసీపీ నేతలు కోర్టులతో కూడా చీవాట్లు పడ్డారని విమర్శించారు. చంద్రబాబు నాయుడు అధ్యక్షతన గురువారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి మండలి సమావేశం జరిగింది. ఈ కేబినెట్ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులకు సీఎం దిశానిర్దేశం చేశారు. మూడున్నర గంటల పాటు ఆయా అంశాలపై ముఖ్యమంత్రి చర్చించారు. స్థానిక ఎన్నికలకు మంత్రులు, కూటమి నేతలు సిద్ధంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. కోర్టుల చీవాట్లు పెట్టినా వైసీపీ నేతలు యాగీ చేస్తున్నారని ఆగ్రహించారు. డీఎస్సీపై వైసీపీ నేతలు ఇప్పుడు ధర్నాలు చేయడం ఏంటని సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. వైసీపీ నేతలకు అసలు రిజర్వేషన్ల గురించి తెలియదని విమర్శించారు. డీఎస్సీలో హారిజాంటల్, వర్టికల్ రిజర్వేషన్లపై.. అందరికీ తెలపాల్సిన బాధ్యత మంత్రులదేనని ఆదేశించారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిన్న దేవరపల్లిలో పర్యటన సందర్భంగా రైతన్నల పొలాలను గొడ్డలి పార్టీ శ్రేణులు నాశనం

మిగతా2లో...

## విద్య వ్యాపార వస్తువుగా మారింది

- ఎల్‌కెజికే లక్షల్లో ఫీజులు దండుకుంటున్నారు
- నిరుద్యోగం, ఫీజుల దోపిడీ,ప్రభుత్వ వ్యవస్థల నిర్వీర్యంపై పోరు
- క్యా బోల్తీ పబ్లిక్ పేరిట...దేశ వ్యాప్త పర్యటనలు
- ఫ్రెజర్ గ్రూపుగా పనిచేసేందుకే నిర్ణయం
- కాక్రోచ్ జనతా పార్టీవ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే



**ముంబై,మన జనప్రగతి ఆగస్ట్ 06:**కాక్రోచ్ జనతా పార్టీవ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే దేశవ్యాప్తంగా 'క్యా బోల్తీ పబ్లిక్' అంటే ప్రజలు ఏమంటున్నారు... పేరుతో కొత్త ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. నిరుద్యోగం, విద్యా సంస్కరణలు, సామాజిక న్యాయం వంటి అంశాలను ప్రజల వద్దకు తీసుకెళ్తామని ఆయన తెలిపారు. విద్యార్థి నిరసనలతో దేశం దృష్టి

మిగతా2లో...



## బయోగ్యాస్ ఉత్పత్తికి ప్రోత్సాహం

- రూ.23,731 కోట్ల 'గోబర్ధన్ పథకం
- కేంద్ర కేబినేట్ కీలక నిర్ణయం

**న్యూఢిల్లీ,మన జనప్రగతి ఆగస్ట్ 06:**ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన గురువారం కేంద్ర మంత్రి మండలి సమావేశం జరిగింది. ఈ కేబినెట్ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులకు ప్రధాని దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు కేంద్ర కేబినెట్‌లో ప్రధాని మోదీ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. బయోగ్యాస్ ఉత్పత్తిని ప్రోత్సహించాలని నిర్ణయించారు. రూ.23,731 కోట్ల '

మిగతా2లో...

## జగన్ అరాచకాలతో జనం బెంబేలు

- పరామర్శల పేరుతో శాంతిభద్రతల సమస్య
- గంజాయి, తాగుబోతు బ్యాచ్‌లతో వీరంగం
- రెండున్నరేళ్లలో అనేక రకాలుగా అకృత్యాలు
- ఇప్పటికే ముగ్గురు ప్రాణాలు కోల్పోయినా పాశ్చాత్తాపం ఏదీ
- మీడియా సమావేశంలో మండిపడ్డ హోంమంత్రి అనిత



**అమరావతి,మన జనప్రగతి ఆగస్ట్ 06:** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పారమర్శల పేరుతో రాష్ట్రంలో అరచాకం సృష్టిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 2024 ఎన్నికల్లో ఓటమి తర్వాత నుంచి పరామర్శల పేరుతో జగన్ సృష్టించిన విధ్వంసాన్ని వివరిస్తూ మీడియాకు ఆమె ప్రజెంటేషన్ ఇచ్చారు. జగన్ పర్యటనల్లో సృష్టించిన అరాచకాల వీడియోలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా అనిత

మిగతా2లో...

## ఆయుశ్‌కు కేంద్రం ప్రాధాన్యం

**- ఏపీ మంత్రి సత్య కుమార్ యాదవ్**



**విజయవాడ,మన జనప్రగతి ఆగస్ట్ 06:** ఆయుశ్‌కు కేంద్ర ప్రభుత్వం భారీ ప్రాధాన్యం ఇస్తోందని ఏపీ మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. ఆయుశ్ బ్జడెట్ రూ.1,070 కోట్ల నుంచి రూ.3,500 కోట్లకు పెంచినట్లు పేర్కొన్నారు. ప్రాచీన వైద్య విధానాలకు మళ్లీ ప్రపంచవ్యాప్తంగా ఆదరణ లభిస్తోందని వెల్లడించారు. గురువారం) విజయవాడలో మంత్రి సత్యకుమార్ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. వ్యాధి నివారణెళి ఆయుశ్ ప్రధాన లక్ష్యమని ఉద్ఘాటించారు. మునగ, అశ్వగంధ, ఉసిరికి ప్రపంచ మార్కెట్‌లో భారీ డిమాండ్ ఉందని వివరించారు. ప్రివెంటివ్ హెల్త్‌కేర్‌పై

మిగతా2లో...




## విద్యార్థులతో రాహుల్ సభకు ఆటంకం

**- అనుమతి రద్దుపై మండిపడ్డ రాహుల్**



## జయశంకర్ సార్‌కు సిఎం రేవంత్ నివాళి

**హైదరాబాద్,మన జనప్రగతి ఆగస్ట్ 06:** ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళు లర్పించారు. సిద్ధాంతకర్తగా తెలంగాణ

మిగతా2లో...

# రాజకీయ ముసుగులో రౌడీయిజం చేస్తున్న వైకాపా

(మొదటి పేజీ తరువాయి)

చేశాయని ధ్వజమెత్తారు. ఓ మహిళ చిరు వ్యాపారి పొట్టగొట్టడంతో పాటు హిందూ దేవుళ్ల చిత్ర పటాలు పగలకొట్టడం ఆక్షేపణీయమని అన్నారు. పొగాకు బేళ్లను తొక్కి నాశనం చేసి పరామర్శ ముసుగు తగిలించుకున్నారని ఆగ్రహించారు. అనేకమంది రైతులు తనకు మెసేజ్‌లు పంపారని తెలిపారు. తమ పంట దెబ్బతిందని అన్నదాతలు తనకు వివరించారని అన్నారు. చివరకు జగన్ పరామర్శలు అంటే జనం భయపడే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. ఈ నెలాఖరుకు వెలుగొండ ప్రాజెక్ట్‌ను ప్రారంభిస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. ప్రకాశం జిల్లా ప్రజలకు తాగునీటి కోసం నీళ్లు ఇస్తామని వెల్లడించారు. ఎల్‌నినో గురించి మంత్రులు ప్రజలకు తెలపాలని సూచించారు. ఇంత వర్షాభావం ఉన్న కూడా మంచినీటికి కూడా మనం నీళ్లు ఇస్తున్నామనేది ప్రజలకు వివరించాలని అన్నారు. భోగాపురం విమానాశ్రయం ప్రారంభం సందర్భంగా తొలిసారి థింసా గిరిజన నృత్యానికి గిన్నిస్ రికార్డు వచ్చిందని ప్రస్తావించారు. ఈ ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవం ఉత్తరాంధ్ర ప్రజల్లో ఓ సెంటిమెంట్‌ను తీసుకువచ్చిందని తెలిపారు. తమ ప్రభుత్వంలో ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు. అక్కడ ల్యాండింగ్ కూడా సముద్రం మీద నుంచి వచ్చే విధంగా ఏర్పాటు చేశామని వివరించారు. స్వర్ణాంధ్ర, వికసిత భారత్ ఈ రెండు స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా మంత్రుల ప్రసంగాల్లో ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. క్వాంటం వ్యాలీ జనవరిలో ప్రారంభమవు తుందని ప్రకటించారు. 'దిశా' అనేది అసలు చట్టం రూపం నోచుకోలేదని సీఎం తెలిపారు. అయినా 'దిశా' పోలీస్ స్టేషన్లు, వాహనాలని చెప్పి హడావుడి చేశారని దుయ్యబట్టారు. 'దిశా' చట్టం అని పంపితే కేంద్రప్రభుత్వం తిరస్కరించి వెనక్కు పంపిందని ప్రస్తావించారు. రాజకీయ పార్టీల ముసుగులో క్రిమినల్స్ తయారవుతున్నారని మండిప డ్డారు. ప్రశాంతంగా ఉండే జిల్లాల్లో శాంతిభద్రతల సమస్యను సృష్టిస్తున్నారని దుయ్యబట్టారు. జగన్ మీటింగ్ అంటే లైసెన్స్ ఇచ్చినట్లుగా మందు తాగించి ప్రజలను తరలిస్తున్నారని ధ్వజమెత్తారు. గంజాయి బ్యాచ్‌ను జెన్ జీ అని చెప్పుకోవడం గొడ్డలి పార్టీకే చెల్లిందని ఎద్దేవా చేశారు. పొగాకు రైతులకు కూటమి ప్రభుత్వం చేస్తున్న లబ్దిని ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యతను మంత్రులే తీసుకోవాలని ఆదేశించారు. ఆక్వా రైతులకు ఆక్వా జోన్, నాన్ ఆక్వాజోన్ అనే తేడా లేకుండా రూ.1100 కోట్లు విద్యుత్ రాయితీలు ఇచ్చామని ప్రస్తావించారు. ఆక్వా ఫీడ్ ఎక్స్‌పోర్ట్ 50శాతం తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసిందని తెలిపారు. అగ్రిగోల్డ్ అంశంపై కేబినెట్‌లో సీఎం చంద్రబాబు సుదీర్ఘంగా చర్చించారు. అగ్రిగోల్డ్ వ్యవహారంలో కేబినెట్ సబ్ కమిటీ చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. అగ్రిగోల్డ్ బాధితులు 11 రాష్ట్రాల్లో ఉన్నారని చెప్పారు. అగ్రిగోల్డ్ బాధితులకు సాధ్యమైనంతవరకు త్వరగా పరిష్కారం చూపాలని ఆదేశించారు. భూములు వేలం వేయడంలో సరైన ధర రావాలని సూచించారు. బాధితులకు న్యాయం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. వేలంతో పాటు ఇతర ప్రత్యామ్నాయాలు కూడా చూడాలని కేబినెట్ సబ్ కమిటీకు సూచించారు. ఇప్పటికే 15 ఏళ్లు పూర్తి అయిందని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరికి న్యాయం జరిగే విధంగా చూడాలని ఆదేశించారు. కేబినెట్ సబ్ కమిటీ ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశర చేశారు. 13న సీడ్ యాక్సెస్ రోడ్డును ప్రారంభిస్తామని మంత్రి నారాయణ తెలిపారు. సీడ్ యాక్సెస్ రోడ్డులో సీఎం కాన్వాయ్ ప్రయాణించి నేరుగా ఎమ్మెల్యే క్వార్టర్స్ వద్దకు వస్తుందని వెల్లడిం చారు. అక్కడ వాటి తాళాలను ముఖ్యమంత్రికి అందజే స్తారని చెప్పారు. విజయదశమి నాటికి మంత్రుల క్వా ర్టర్స్‌ను సిద్ధం చేస్తామని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

# జగన్ అరాచకాలతో జనం బెంబేలు

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ... తన రాజకీయం కోసం పేదలను గొడ్డలి పార్టీ అధ్యక్షుడు ఇబ్బంది పెడుతున్నారని ధ్వజమెత్తారు. రెండేళ్లలో జగన్ చేసిన పర్యటనలతో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని వెల్లడించారు. పరామర్శల పేరుతో విధ్వంసం, అరాచకం సృష్టిస్తు న్నారని ధ్వజమెత్తారు. జగన్ బూటకపు పరామర్శలు చేస్తూ ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారని మండిపడ్డారు. మంచి, చెడు రెండింటిని ప్రజలు గమనిస్తారని తెలిపారు. ఈ రెండేళ్లలో రెండు వేర్వేరు నడవడిక ఉన్న నాయకులను ప్రజలు చూశారని చెప్పుకొచ్చారు. సీఎం చంద్రబాబు రోజుకు 18 గంటలు కష్టపడుతు న్నారని, సీఎం కృషితోనే పరిశ్రమలు, పెట్టుబడులు రాష్ట్రానికి వస్తున్నాయని వివరించారు. ఏపీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కూడా మద్దతు ఇస్తోందని వెల్లడించారు. మరోవైపు గొడ్డలి పార్టీ అధ్యక్షుడు బయట అడుగు పెడితే విధ్వంసం, అరాచకం జరుగుతోందని ఆగ్రహించారు. ఆయన బయట అడుగుపెడితే మహిళలకు రక్షణ లేదని, సామాన్య ప్రజలు వ్యాపారాలు చేసుకోలేరని చెప్పుకొచ్చారు. పోలీసులను సైతం బెదిరించి బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని ఆగ్రహించారు. ఏపీలో అభివృద్ధిని చూసి ఓర్వలేక ఏదో ఒక పరామర్శ పేరుతో ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారని దుయ్యబట్టారు. భవిష్యత్తు మన బిడ్డలదని... మన చుట్టూ ఎలాంటి నాయకులు ఉన్నారో గమనించాలని అన్నారు. ప్రజాస్వామ్యంలో ధర్నాలు, నిరసనలు చేసే హక్కు ప్రతిపక్షానికి ఉందని చెప్పుకొచ్చారు. వైసీపీ నేతలు బాధ్యతాయుతమైన ప్రశ్నలు అడగాలని.. తాము సమాధానం చెబుతామని అన్నారు. ప్రజలకు ఉపయోగపడే ఏ ఒక్క పనినైనా ఆయన చేస్తున్నారా ప్రజలు ఆలోచించాలని పేర్కొన్నారు. దిశాబిల్లు ఉపసంహరణపై హోం మంత్రి అనిత మాట్లాడారు. జగన్ హయాంలో దిశా చట్టం లేకుండానే పోలీస్ స్టేషన్లు పెట్టారని, పోలీసులకు బాధ్యతలు ఇచ్చారని చెప్పుకొచ్చారు. పోలీసులకు ఫింగర్ ప్రింట్ అథంటికేషన్ ఎక్యూప్‌మెంట్ కూడా వైసీపీ హయాంలో ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. జగన్ పర్యటనలో ఎంతమంది వస్తారు, బారికేడ్లు ఎంత ఎత్తులో ఉండాలో పోలీసులే చెబుతారని అన్నారు. చట్టాలను గౌరవించేవారికి అవి వర్తిస్తాయని చెప్పారు. వారు నిబంధనలను ఎందుకు పాటించడం లేదని ప్రశ్నించారు. విధ్వంసం సృష్టించాలనే ఆయన బయటకు వస్తున్నారని మండిపడ్డారు. 2019కు ముందు ఒక్క ఛాన్స్ అని చెప్పి అరాచకం సృష్టించారని ఆగ్రహించా రు. శుక్రవారం వస్తే చాలు ఎవరిని జైల్లో పెడతారో తెలియని పరిస్థితి వైసీపీ హయాంలో ఉందని ఆరోపించారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గరి నుంచి తాము చేసిన అభివృద్ధి, సంక్షేమ పనుల గురించి చెప్పుకోవడానికి ఎన్ని పేజీలైనా సరిపోవని తెలిపారు. ఏపీలో జరుగుతున్న అభివృద్ధిని జగన్ చూడలేకపోతున్నారని దుయ్యబట్టారు. ఆయన ఎక్కడికి వచ్చినా విధ్వంసాలు, ఉద్రేకాలు సృష్టిస్తున్నారని ÷ర్ అయ్యారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని అనుసరించే తాము చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. జగన్ వెనుక ఉన్నది జన్‌జీలు కాదని.. గంజాయిలు అని ఎద్దేవా చేశారు. జగన్‌కు అర్హత మేరకే సెక్యూరిటీ కల్పించామని హోం మంత్రి అనిత స్పష్టం చేశారు. డీఎస్సీ విషయంలో ఎలాంటి అవకతవకలు జరగలేదని కోర్టులు చెప్పాయని ప్రస్తావించారు. వైసీపీ నేతలకు మంత్రి నారా లోకేశ్ అంటే భయమని విమర్శించారు. భస్మాసురుడికి అహం తలకెక్కినట్లే జగన్ ప్రవర్తన ఉందని ఎద్దేవా చేశారు. ఆయనకు ఒక్క అవకాశం ఇచ్చిన ప్రజల నాశనాన్ని కోరుకున్నారని ఆగ్రహించారు. భస్మాసురుడికి పట్టిన గతే గొడ్డలి పార్టీ అధ్యక్షుడికి పడుతుందని హోం మంత్రి అనిత సెటైర్లు గుప్పించారు. విజనరీ నాయకుడు చంద్రబాబు ఏపీని అభివృద్ధి చేస్తున్నారని ఉద్ఘాటించారు. ఆయన విధ్వంసం, అరాచకాలు సృష్టిస్తున్నారని ధ్వజమెత్తారు. మిర్చి రైతుల పరామర్శ పేరుతో గుంటూరు మిర్చియార్డుకు వెళ్లి రైతులను తన బౌన్సర్లతో కొట్టించారని ఆగ్రహించారు. మిర్చి టిక్కీలను ఫ్యాన్ పార్టీ నేతలు దొంగతనం చేశారని ఆరోపించారు. పరామర్శ పేరుతో బల ప్రదర్శనలు చేసి.. రైతులను కొట్టి.. దొంగతనాలు చేస్తారా..? ఇదేం తీరు.? అని ప్రశ్నించారు. గంజాయి తాగండి... మహిళలను ఏడ్పించాలని జగన్ మోహన్ రెడ్డి జనాలకు చెప్పాలను కుంటున్నారా..? అని ఎద్దేవా చేశారు. జగన్ సొంత బాబాయ్ హత్యలో ఆయన వ్యవహారించిన తీరు చూశారని తెలిపారు. తల్లిదండ్రులు యువతను గొడ్డలి పార్టీ కార్యక్రమాలకు పంపొద్దని హోం మంత్రి అనిత సూచించారు.

# విద్య వ్యాపార వస్తువుగా మారింది

(మొదటి పేజీ తరువాయి)

ఆకర్షించిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కీలక ప్రకటన చేసింది. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు 'క్యా బోల్తీ పబ్లిక్' పేరిట జాతీయస్థాయి ప్రచారం నిర్వహిస్తామని వెల్లడించింది. ప్రజల ఆందోళనలు, ఆకాంక్షలను అర్థం చేసుకోవడం, అభిప్రాయాలను తీసుకోవడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని స్పష్టం చేసింది. సెప్టెంబర్ నుంచి దేశవ్యాప్తంగా పర్యటించి ప్రతి ఒక్కరితోనూ మమేకమవుతామని తెలిపారు. సీజేపీ ఒక రాజకీయ పార్టీగా మారకుండా ఒక ఒత్తిడి బృందంగానే కొనసాగుతుందని దీప్కే ప్రకటించారు. మహారాష్ట్రలో నిర్వహించిన పార్టీ ప్రధాన బృంద సమావేశం అనంతరం దీప్కే ఈ ప్రకటన చేశారు. ప్రస్తుతం ఎన్నికల్లో పోటీ చేయాలనే ఉద్దేశం లేదని, ప్రజల తరఫున ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువచ్చే ప్రెషర్ గ్రూప్‌గా పనిచేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. దేశ యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్య, ప్రైవేట్ విద్యాసంస్థల అధిక ఫీజులు, ప్రభుత్వ పాఠశాలల నాణ్యత, ప్రభుత్వ వ్యవస్థలపై ప్రజల్లో తగ్గుతున్న విశ్వాసం వంటి అంశాలపై ఉద్యమాన్ని మరింత విస్తరించనున్నట్లు తెలిపారు. ఈ ప్రచారంలో విద్యార్థులు, యువత, సాధారణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ రోజు మన దేశంలో సంస్థాగత జవాబుదారీతనం ప్రమాదకర స్థితిలో ఉంది. ఇది మన ప్రజాస్వామ్యానికి ఒక ప్రమాదకర సంకేతం. గతంలో ఓటర్లు ప్రభుత్వాన్ని ఎన్నుకునేవారు. ఈ రోజు ఎవరు ఓటు వేయాలో ప్రభుత్వమే నిర్ణయిస్తోంది. ప్రజాస్వామ్యం ఇలా పనిచేయదు. మనం ఎన్నికల సంఘం జవాబుదారీతనాన్ని సరిదిద్దాలి. మనం ఇది చేసేంత వరకు దేశంలో ఎన్నికల అవకతవకలు కొనసాగుతాయి' అని దీప్కే పేర్కొన్నారు. నిరుద్యోగం దేశంలో ఒక ప్రధాన సమస్య అని, దీనిని దేశవ్యాప్త సమస్యగా పరిగణిస్తామని దీప్కే తెలిపారు. భారతీయ కుటుంబాలకు నాణ్యమైన విద్య రోజురోజుకూ భారంగా మారుతోందని, అందుకే ఆ అంశంపైనే తొలుత తాము దృష్టిసారిస్తామని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తెలిపారు. సెప్టెంబర్ నుంచి ప్రజల్లోకి వెళ్తామని మీడియా వేదికగా తెలియజేశారు. ఒకటో తరగతికే ఫీజులు రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షల వరకు చెల్లించాల్సి వస్తోంది. కొన్ని పాఠశాలల్లో ఇంకా ఎక్కువే ఫీజులు ఉంటున్నాయి. మధ్యతరగతి కుటుంబాలు ఆ మొత్తాన్ని ఎలా భరిస్తాయి. ఈ ఖర్చుల వల్ల ప్రజలు అప్పులు చేయాల్సిన పరిస్థితి వస్తోంది.

రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ చెప్పిన ప్రకారం.. విద్య ప్రాథమిక హక్కు. గత కొన్నేళ్లుగా అది ఒక వ్యాపారంగా మారిపోయిందని దీప్కే ఆందోళన వ్యక్తంచేశారు. తమ ప్రచారంలో పాల్గొనాలనుకునేవారు అధికారిక క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేయాలని సూచించారు. ఆ క్యూఆర్ కోడ్‌లను మీడియా సమావేశంలో ప్రదర్శించారు. సభ్యత్వం పూర్తిగా ఉచితమని చెప్పారు. మోసపూరిత చెల్లింపు అభ్యర్థనల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యవస్థలు ప్రజలకు జవాబుదారీగా ఉండేలా... ఒత్తిడి తెచ్చే సంస్థగా సీజేపీ పనిచేస్తుందని అభిజీత్ దీప్కే పేర్కొన్నారు. రాజకీయ పార్టీల పరిస్థితి దారుణంగా ఉంది. ప్రజలు ఉదయం ఒక పార్టీకి ఓటేస్తే సాయంత్రంకల్లా మరో పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని ఆయన అన్నారు.

# విద్యార్థులతో రాహుల్ సభకు ఆటంకం

## - అనుమతి రద్దుపై మండిపడ్డ రాహుల్

**న్యూఢిల్లీ,మన జనప్రగతి ఆగస్ట్ 06:** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో విద్యార్థులతో రాహుల్ గాంధీ నిర్వహించాల్సిన సమావేశానికి అనుమతి రద్దు కావడం వివాదంగా మారింది. ఆగస్టు 8న జరగాల్సిన 'ఛాత్రోంకి గూంజ్' కార్యక్రమానికి రెండు రోజుల ముందే వేదిక అనుమతిని రద్దు చేశారు.

ఈ కార్యక్రమం జరగాల్సిన కేపీ గ్రౌండ్ యజమాని అయిన కాయస్థ పాఠశాల ట్రస్ట్.. అలహాబాద్ హైకోర్టు ఆదేశాలను కారణంగా చూపిస్తూ అనుమతిని వెనక్కి తీసుకుంది. 'ఛాత్రోంకి గూంజ్' కార్యక్రమానికి అనుమతి రద్దు చేయడంపై రాహుల్ గాంధీ ఉత్తరప్రదేశ్‌లోని బీజేపీ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. తనను అడ్డుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అయితే, తనను ఎవరూ ఆపలేరని, విద్యార్థుల సమస్యలపై తన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అలహాబాద్ విశ్వవిద్యాలయంలో ఫీజుల పెంపు, సీట్ల తగ్గింపుకు వ్యతిరేకంగా విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం పోరాడుతున్నారని రాహుల్ తెలిపారు. వారి సమస్యలను వినకుండా వారిపై కేసులు పెడుతు న్నారని ఆరోపించారు.

యువత గొంతును అణచివేయడమే ప్రభుత్వ విధానమని, ప్రశ్నిస్తే లాఠీ దెబ్బలు, నిరసన చేస్తే కేసులు, మాట్లాడితే కఠిన చర్యలు తీసుకుంటున్నారని రాహుల్ గాంధీ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలను తెలుసుకోవడానికి తాను ప్రయాగ్‌రాజ్‌కు రావాలని నిర్ణయిం చుకున్నప్పటి నుంచి తన కార్యక్రమాన్ని అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. విద్యార్థుల గొంతుకు ప్రభుత్వం భయపడుతోందని విమర్శించారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా విద్యార్థులకు అండగా ఉంటానని రాహుల్ స్పష్టం చేశారు.

# కృష్ణా నీటి వాటాలను తేల్చండి

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ వాటాలు ఖరారు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా నీటిని జాగ్రత్తగా వాడుకోవాల్సిన అవసరముందని ఏపీ ప్రభుత్వం అభిప్రాయపడింది. రెండు రాష్ట్రాలకు నీటి కేటాయింపులపై చర్చించి తగిన నిర్ణయం తీసుకోవాలని కోరింది. నీటి వాటాల సింగిల్ పాయింట్ అజెండాతో సమావేశం ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. బోర్డు లేదా త్రిసభ్య కమిటీ సమావేశం నిర్వహించాలని విజ్ఞప్తి చేసింది.

# అగ్ని-4 పరీక్ష విజయవంతం

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు. పరీక్ష సందర్భంగా క్షిపణికి సంబంధించిన అన్ని ఆపరేషనల్, సాంకేతిక ప్రమాణాలను విజయవంతంగా అందుకున్నట్టు రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. అగ్ని శ్రేణి క్షిపణులు భారత వ్యూహాత్మక రక్షణ సామర్థ్యంలో కీలకమైనవి. అగ్ని-4 సుమారు 4,000 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను చేరుకోగల సామర్థ్యం కలిగిన బాలిస్టిక్ క్షిపణి.

# స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కండి

(మొదటి పేజీ తరువాయి)

మంత్రులంతా కష్టపడాల్సి ఉంటుందన్నారు. గురువారం కేబినెట్ సమావేశానికి ముందు మంత్రులతో లోకేశ్ బ్రేక్ ఫాస్ట్ సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల్లో మెజారిటీ స్థానాలను కూటమి అభ్యర్థులు కైవసం చేసుకోవాలన్నారు. ఈ ఎన్నికలు అనుకున్న సమయానికే జరుగుతాయని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ చేసిన విధ్వంసం, కూటమి ప్రభుత్వం గాడిలో పెట్టిన తీరును అందరికీ తెలియాలని చెప్పారు. ప్రతి ఇంటి వద్దా కనీసం 3 నిమిషాలైనా ఉండి వివరించాలంటూ మంత్రులకు దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీలో చర్చించాల్సిన అంశాలపై లోకేశ్ వద్ద మంత్రులు చర్చించారు. ఎల్‌నినో పరిస్థితులను ప్రజలకు అసెంబ్లీ వేదికగా వివరిద్దామని మంత్రి తెలిపారు. జలాశయాల్లోకి వరద రావడం కాస్త ఊరటనిచ్చే అంశమని చెప్పుకొచ్చారు. తొలి ప్రాధాన్యం తాగునీరు, ద్వితీయ ప్రాధాన్యం పశుగ్రాసానికి ఇవ్వాలని సూచించారు. ప్రజా సమస్యలపై చర్చించి పరిష్కారానికి అసెంబ్లీని వేదిక చేసుకుందామని మంత్రులకు లోకేశ్ వివరించారు.

# బయోగ్యాస్ ఉత్పత్తికి ప్రోత్సాహం

(మొదటి పేజీ తరువాయి)

గోబర్ధన్' జాతీయ సర్క్యులర్ బయోఎనర్జీ పథకానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. 2026-27 నుంచి 2035-36 వరకు కేంద్రం అమలు చేయనుంది. వ్యవసాయ అవశేషాలు, పశువుల పేడ, సేంద్రీయ వ్యర్థాలతో కంప్రెస్డ్ బయోగ్యాస్ (అఃఉ) ఉత్పత్తి చేయనుంది. దేశీయ అఃఉ ఉత్పత్తిని దాదాపు పది రెట్లు పెంచడమే లక్ష్యమని కేంద్ర మంత్రులు తెలిపారు. దిగుమతి సహజవాయువుపై ఆధారాన్ని తగ్గించి ఇంధన భద్రతకు బలం చేకూర్చనుందని వెల్లడించారు. రైతులు, గ్రామీణ పారిశ్రామికవేత్తలు, సహకార సంఘాలకు కొత్త ఆదాయ అవకాశాలు వస్తాయని మంత్రులు పేర్కొన్నారు. అస్సాంలో నాలుగు లేన్ల నేషనల్ హైవేకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. రూ. 8,970 కోట్లతో అస్సాంలో నేషనల్ హైవే నిర్మించాలని మంత్రులు ఆమోదించారు.

# ఆయుశ్‌కు కేంద్రం ప్రాధాన్యం

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి తెలిపారు. ఏపీలో ఆయుశ్ అభివృద్ధికి కేంద్రం నిధులను పెంచిందని చెప్పుకొచ్చారు. ఔంఓ కింద ఏపీకి మూడేళ్లలో రూ.426 కోట్ల నిధులు విడుదల అయ్యాయని వెల్లడించారు. విజయవాడ, కాకినాడ, కడప ఆయుశ్ ఆస్పత్రుల ఆధునికీకరణ చేస్తున్నట్లు తెలిపారు. 150 ఆయుశ్ డిస్పెన్సరీల అప్‌గ్రేడేషన్ చేస్తున్నట్లు చెప్పుకొచ్చారు. 126 కేంద్రాలు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లుగా మార్చినట్లు వెల్లడించారు. 90 ఆయుశ్ కేంద్రాలను ఔంఃఊ గుర్తించిందని తెలిపారు. ప్రజలకు సహజసిద్ధ నివారణా వైద్యం అందించడమే లక్ష్యంగా కేంద్రం పని చేస్తోందని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

# జయశంకర్ సార్‌కు సిఎం రేవంత్ నివాళి

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యమంలో ప్రొఫెసర్ జయశంకర్ పాత్ర అత్యంత కీలకమైందని అన్నారు.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జీవితాంతం అహర్నిశలు శ్రమించిన మహనీయుడని ఆయన కొనియాడారు.ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాల సాధనకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# నేడు చీరాల పర్యటనకు సిఎం చంద్రబాబు

## • నేతన్నల సేవ పథకం కింద నగదు అందచేత



**అమరావతి,మన జనప్రగతి ఆగస్ట్ 06:** చేనేతలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అండగా నిలుస్తోంది. 'నేతన్న సేవలో' పథకం కింద ఒక్కో కుటుంబానికి రూ. 25 వేలు అందజేయనుంది. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చీరాలలో నిధులను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం విడుదల చేయనున్నారు. రూ. 179 కోట్లతో 71,536 చేనేత కుటుంబాలకు లబ్ది చేకూరనుంది. చీరాలలో సీఎం చంద్రబాబు శుక్రవారం పర్యటించనున్నారు. వేటపాలెం మండలం కొత్తపేటలో చేనేత దినోత్సవం కార్యక్రమంలో పాల్గొననున్నారు. నేతన్న సేవలో పథకం ద్వారా చేనేతల ఖాతాలకు రూ. 5 వేలు నగదు బదిలీ చేయనున్నారు. చీరాల మండలం జాండ్రపేటలో చేనేత మగ్గాలను పరిశీలించి లబ్దిదారులతో ముఖాముఖిలో మాట్లాడనున్నారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు పర్యటన షెడ్యూల్ ఖరారైంది. ఉదయం 10:30 గంటలకు ఉండవల్లి నుంచి హెలికాప్టర్ ద్వారా కొత్తపేట బయలుదేరనున్నారు. 10:50లకు కొత్తపేటకు సీఎం చంద్రబాబు చేరుకోనున్నారు. 11:05 నుంచి 12:35 వరకు ప్రజా వేదికలో పాల్గొంటారు. ప్రజా వేదిక సభలో 'నేతన్న సేవలో' పథకాన్ని ప్రారంభిస్తారు. చేనేతల ఖాతాలకు రూ. 25 వేల చొప్పున నగదు బదిలీ చేస్తారు. 1:20లకు చీరాల మండలం జాండ్రపేటలో మగ్గాలను పరిశీలించి చేనేతలతో మాట్లాడుతారు. 2:30కి చీరాల తెలుగుదేశం పార్టీ కార్యాలయం సమీపంలో కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. 4.25కి కొత్తపేట నుంచి హెలికాప్టర్‌లో సీఎం చంద్రబాబు ఉండవల్లి బయలుదేరి వెళ్లనున్నారు.

# సి.బెలగల్ పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ విక్రాంత్ పాటిల్.

● మహిళల భద్రత,బాల్యవివాహాల నిర్మూలనకు, సైబర్ మోసాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలి




**కర్నూలు బ్యూరో/సి.బెలగల్ మన జనప్రగతి ఆగస్ట్ 06:**-సి.బెలగల్ పోలీసు స్టేషన్‌ను కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులు, నమోదైన కేసులు, పెండింగ్ కేసుల పురోగతి, నిందితుల అరెస్టులు, దర్యాప్తు స్థితిగతులను రికార్డులు పరిశీలించారు.రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్‌పై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. అలాగే ప్రాపర్టీ కేసులను త్వరితగతిన ఛేదించి రికవరీలు చేపట్టాలని సూచించారు.ప్రజల్లో భద్రతాభావం పెంపొందేలా విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలన్నారు.పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వర సేవలు అందించి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు.మహిళలపై జరిగే నేరాలపై తక్షణమే స్పందించి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.బాల్యవివాహాల నిర్మూలనకు గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి అలాంటి ఘటనలను అడ్డుకోవాలని సూచించారు.సైబర్ నేరాల బారిన పడిన బాధితులకు సకాలంలో స్పందించి, నష్టపోయిన సొమ్ము తిరిగి పొందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని, సైబర్ మోసాల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తూ సైబర్ హెల్ప్‌లైన్ 1930 గురించి విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు.కర్నూలు ఎస్పీతో పాటు కోడుమూరు సీఐ తబ్రేజ్, సి.బెలగల్ ఎస్సై వేణుగోపాల్ రాజు పాల్గొన్నారు.

# బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో నేరుగా ప్రవేశాలు




**పులివెందుల అర్బన్ మన జనప్రగతి ఆగస్టు 06:** పులివెందుల మండల పరిధిలోని బెస్తవారిపల్లె గ్రామంలో ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్లకు విద్యార్థులు నేరుగా ప్రవేశం పొందవచ్చని ప్రిన్సిపాల్ సి. నరసింహులు ఒక ప్రకటనలో తెలిపారు.పాఠశాలలో 5వ తరగతి,6వ తరగతి,9వ తరగతులలో కొన్ని ఎస్‌ఈ సీట్లు ఖాళీగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.అలాగే ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ మరియు బైపీసీ గ్రూపులలో కూడా కొన్ని ఎస్‌ఈ సీట్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు.ఆసక్తి ఉన్న అర్హులైన విద్యార్థులు పాఠశాల ప్రిన్సిపాల్‌ను నేరుగా కలిసి ప్రవేశం పొందవచ్చని సూచించారు.

# డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ కోరుతూ.. ప్రొద్దుటూరులో వైఎస్సార్సీపీ రిలే దీక్షలు ప్రారంభం




**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి ఆగస్టు 06:**- మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఆందోళనల్లో భాగంగా, ప్రొద్దుటూరులో వైఎస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి,మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం రిలే నిరాహార దీక్షలు ప్రారంభమయ్యాయి. స్థానిక మున్సిపల్ కార్యాలయం ప్రధాన ద్వారం ఎదురుగా నిర్వహించిన ఈ దీక్షల్లో,డీఎస్సీ నియామకాలలో జరిగినట్లు ఆరోపిస్తున్న అక్రమాలపై సీబీఐతో విచారణ జరిపించాలని, అందుకు నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని,పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని,అలాగే నిరుద్యోగ భృతి రూ.3 వేల ను అర్హులకు తక్షణమే అందించాలని డిమాండ్ చేశారు.రిలే దీక్షల తొలి రోజు ప్రొద్దుటూరు ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సోములవారిపల్లె పంచాయతీకి చెందిన పలువురు ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు దీక్షలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, యువత, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే స్పందించాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# పత్తికొండ రోడ్డు విస్తరణకు ఆటో కార్మికులతో సంతకాల సేకరణ




**పత్తికొండ మన జనప్రగతి ఆగస్టు 06:**-పత్తికొండ పట్టణంలో రోడ్డు విస్తరణ చేపట్టాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో గురువారం నాలుగు స్తంభాల కూడలి వద్ద ఆటో కార్మికులతో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిఐటియు మండల కార్యదర్శి ఎం. రవిచంద్ర అధ్యక్షత వహించగా, సిపిఎం మండల కార్యదర్శి చక్రాల వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పత్తికొండలో రోడ్డు విస్తరణ అంశం ఎన్నో ఏళ్లుగా వాగ్దానాలకే పరిమితమైందని, రద్దీ కారణంగా ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రోడ్డు విస్తరణ జరిగే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు.ఈ నెల 8న ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నుంచి నాలుగు స్తంభాల కూడలి వరకు ఆటో ర్యాలీ నిర్వహించి, అనంతరం ధర్నా చేపడతామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆటో కార్మికులు, పట్టణ ప్రజలు, గ్రామీణ ప్రాంతాల వాహనదారులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఎం, సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, ప్రజానాట్యమండలి నాయకులు, ఆటో కార్మిక సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# వేదవతి ప్రాజెక్టు భూసేకరణతో పాటు నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నాం: జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి.



**కర్నూలు బ్యూరో ఆలూరు మన జనప్రగతి ఆగస్టు 06:**వేదవతి ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియతో పాటు నిర్మాణ పనులను వేగవంతంగా చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు. గురువారం ఆలూరు నియోజకవర్గం హోలహర్వి మండలం అమృతాపురం గ్రామం వద్ద వేదవతి ప్రాజెక్ట్ పంప్ హౌస్ -1 ఏర్పాటు ప్రదేశాన్ని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేదవతి (హగరి) నదిలో నాలుగు నుంచి ఐదు నెలల పాటు ప్రవహించే నీటిని సద్వినియోగం చేసుకుని నిల్వ చేసేందుకు ఈ ప్రాజెక్టును రూపొందించినట్లు కలెక్టర్ తెలిపారు. నది నుంచి లిఫ్ట్ ద్వారా పైప్‌లైన్ ఏర్పాటు చేసి మొదట 2 టీఎంసీల సామర్థ్యం గల హోలహర్వి రిజర్వాయర్‌లో నీటిని నిల్వ చేసి, అక్కడి నుంచి గ్రెజర్ మెయిన్ ద్వారా గురుత్వాకర్షణ పద్ధతిలో 1 టీఎంసీ సామర్థ్యం గల మొలగవల్లి రిజర్వాయర్‌కు నీటిని తరలించే విధంగా ప్రణాళిక రూపొందించినట్లు కలెక్టర్ వివరించారు. ఈ రెండు రిజర్వాయర్లలో మొత్తం 3 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఏర్పడుతుందన్నారు. ఇరిగేషన్ శాఖ అంచనాల ప్రకారం వేదవతి నది నుంచి 6 నుంచి 7 టీఎంసీల వరకు నీటిని వినియోగించుకునే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. నిల్వ సామర్థ్యంతో పాటు అవసరమైన మేర సాగునీటిని నిరంతరంగా అందించేలా ప్రాజెక్టు రూపకల్పన చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. మొలగవల్లి రిజర్వాయర్‌కు హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా అదనపు నీటి సరఫరా కోసం అవసరమైన పంపింగ్ వ్యవస్థ, పైప్‌లైన్ పనులు కూడా చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు మొత్తం పనుల్లో సుమారు 10 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులను వేగంగా పూర్తి చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు కలెక్టర్ వెల్లడించారు. ప్రాజెక్టు కోసం సుమారు 4 వేల ఎకరాల భూసేకరణ అవసరమవుతుందని, ఇప్పటికే 500 నుంచి 600 ఎకరాల భూమిని సేకరించినట్లు కలెక్టర్ తెలిపారు. మిగిలిన భూసేకరణను వేగవంతం చేసేందుకు ప్రత్యేక లక్ష్యాలు నిర్దేశించినట్లు కలెక్టర్ తెలిపారు. బడ్జెట్ విడుదలైన వెంటనే మరో 600 ఎకరాల వరకు భూసేకరణ ప్రక్రియను ఒకటి నుంచి రెండు నెలల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి తాను, జాయింట్ కలెక్టర్‌తో కలిసి ప్రాజెక్టు పురోగతిని సమీక్షిస్తామని, భూసేకరణతో పాటు నిర్మాణ పనులను వేగవంతం చేసి గరిష్ఠంగా ఏడాదిన్నరలో ప్రాజెక్టును పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తయితే సుమారు 80 వేల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం కలుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.అనంతరం వేదవతి ప్రాజెక్ట్ కు సంబంధించి ఆలూరు మండలం అరికెర గ్రామం వద్ద ఎత్తిపోతల పథకం పనులను కలెక్టర్ పరిశీలిస్తూ అధికారులకు పలు సూచనలు జారీ చేశారు.కార్యక్రమంలో ఆలూరు టీడీపీ ఇంచార్జి వైకుంఠం జ్యోతి, పత్తికొండ ఆర్డీఓ ఓబులేసు, ఇరిగేషన్ ఎస్‌ఈ శైలేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

# అసైన్డ్ భూముల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ఎస్సీ కమిషన్ ప్రత్యేక దృష్టి



కోసిగి మండలంలో భూ సమస్యపై క్షేత్రస్థాయి నిజ నిర్ధారణ చేపట్టిన రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు.

రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు మేకల భిక్షం (దాసు).



**కర్నూలు బ్యూరో కోసిగి మన జనప్రగతి ఆగస్టు 06:**- అసైన్డ్ భూముల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ఎస్సీ కమిషన్ ప్రత్యేక దృష్టి చేపట్టిందని రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు మేకల భిక్షం పేర్కొన్నారు.రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల కమిషన్ ఛైర్మన్ కె.ఎస్.జవహర్ ఆదేశాల మేరకు గురువారం కర్నూలు జిల్లా మంత్రాలయం నియోజకవర్గం కోసిగి మండలం కోల్మాన్‌పేట గ్రామంలోని సర్వే నెంబర్లు 232/1, 232/2లో గల 3.92 ఎకరాల అసైన్డ్ భూమికి సంబంధించి దాసరి సంగీతమ్మ సమర్పించిన ఫిర్యాదుపై రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు మేకల బిక్షం (దాసు) క్షేత్రస్థాయిలో నిజ నిర్ధారణ (ఫ్యాక్ట్ ఫైండింగ్) నిర్వహించారు.ఈ సందర్భంగా సంబంధిత భూమిని ప్రత్యక్షంగా పరిశీలించిన కమిషన్ సభ్యులు, రెవెన్యూ మరియు పోలీసు శాఖ అధికారుల నుంచి పూర్తి వివరాలను సేకరించారు. అలాగే బాధితురాలు, గ్రామ ప్రజలు మరియు సంబంధిత వ్యక్తుల వాదనలు, అభిప్రాయాలను తెలుసుకుని సంఘటనకు సంబంధించిన వాస్తవ పరిస్థితులను సమగ్రంగా పరిశీలించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు మేకల బిక్షం (దాసు) మాట్లాడుతూ దాసరి సంగీతమ్మ సమర్పించిన ఫిర్యాదు ఆధారంగా ఎస్సీ కమిషన్ ఛైర్మన్ ఎస్.జవహర్ ఆదేశాల మేరకు ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ సభ్యునిగా క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించినట్లు తెలిపారు.పరిశీలనలో వెల్లడైన అంశాలు,సంబంధిత శాఖల అధికారులు సమర్పించిన వివరాలు,బాధితుల వాంగ్మూలాలు, క్షేత్రస్థాయిలో సేకరించిన సమాచారాన్ని సమగ్ర నివేదిక రూపంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్‌కు సమర్పిస్తామని తెలిపారు. ఆ నివేదికను పరిశీలించిన అనంతరం గౌరవ ఛైర్మన్ తదుపరి చర్యలపై తగిన ఆదేశాలు జారీ చేస్తారని పేర్కొన్నారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ దళితుల రాజ్యాంగబద్ధ హక్కుల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, బాధితులకు న్యాయం జరిగేలా చట్టబద్ధమైన చర్యలు చేపట్టేందుకు కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. భూ వివాదానికి సంబంధించిన పూర్తి వివరాలతో సమగ్ర చర్యల నివేదిక ను 15 రోజుల్లోగా రాష్ట్ర ఎస్సీ కమిషన్‌కు సమర్పించాలని రెవెన్యూ శాఖ మరియు పోలీసు శాఖ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. నివేదిక అందిన అనంతరం కమిషన్ నిబంధనల మేరకు తదుపరి చర్యలు చేపడుతుందని పేర్కొన్నారు.ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో ఆర్డీవో అరుణ దేవి, తహశీల్దార్ వేణు గోపాల్ శర్మ, సర్కిల్ ఇన్స్పెక్టర్ మంజునాథ్, బాధిత కుటుంబ సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# 10న జైల్‌భరోను జయప్రదం చేయండి



## రైతు,వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపు

**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి ఆగస్టు 06:**-కార్మికులు, రైతులు, సామాన్య ప్రజల సమస్య ప్రయోజనాలను నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు కట్టబెడుతున్న నిరసిస్తూ 9న క్విట్ ఇండియా దే సందర్భంగా కార్పొరేట్ హటావ్ దేశ్ కో భచావ్ నినాదంతో రాయచోటి ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసనను జయప్రదం చేయాలని కార్మిక, రైతు, వ్యవసాయ కార్మికసంఘాల జిల్లా కార్యదర్శులు రామాంజులు, రామచంద్ర, సుధీర్, సీఐటీయూ జిల్లా కోశాధికారి భాగ్యలక్ష్మీ కె వి పి యస్ జిల్లా అధ్యక్షులు వెంకటయ్య లు తెలిపారు. గురువారశీ స్థానిక గర్ల్స్ హై స్కూల్ ఆవరణలో సీఐటీయూ మండల అధ్యక్షులు బీవీ రమణ అధ్యక్షతన జరిగిన నాలుగు సంఘాల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ క్రియేట్ ఇండియా దినోత్సవాన్ని వ్యతిరేకిస్తూ వచ్చే 10న సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఆందోళన చేయనున్నట్లు తెలిపారు. దేశ స్వాతంత్రం కోసం, పరాయి పాలనకు వ్యతిరేకంగా క్విట్ ఇండియా ఉద్యమం ఏ విధంగా జరిగిందో అదే స్ఫూర్తితో నేడు దేశంలో పెరిగి పోతున్న కార్పొరేట్ కంపెనీల కబంధహస్తాల నుంచి విముక్తికోసం, ప్రభుత్వ రంగ సంస్థలను వర్క్‌ప్లేస్‌లో నిలబెట్టేందుకు చేపట్టే కార్పొరేట్‌లకు వ్యతిరేకంగా జైల్‌భరోను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బ్యాంకులలో లక్షల కోట్లు రూపాయలను కార్పొరేట్లకు ఉదారంగా అందించినా 12 సంవత్సరాల కాలంలో దాదాపు రూ.12 లక్షల కోట్లు రూపాయలను రైటాఫ్ పేరుతో మాఫీ చేసిందని చెప్పారు. వ్యవసాయ సంక్షోభం ఫలితంగా ఆత్మహత్యలు కూడుకు పోయి అత్మహత్యలు చేసుకుంటున్న రైతులను మాఫీ చేయడానికి మోడీ ప్రభుత్వానికి చేతులు రావడం లేదన్నారు. కార్పొరేట్ కంపెనీల రూపాయలు మాఫీ చేయడం కాదు, రైతుల రూపాయలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘిస్తూ ఓడరేవులు, ఎయిర్ పోర్టులు, విద్యుత్ సంస్థలు, రైల్వే, బొగ్గ గనులు, చమురు ఆధారా, గరిజనులు అన్ని భూములపై పట్టుకున్న హరిత్తు రాజ్యం అటవీ చట్టానికి సవరణ పాస్ చేయని విమర్శించారు. ఈ చర్యలకు కార్పొరేట్లకు ప్రత్యేకంగా మోడీ మార్గన పుత్రుడు గౌతమ్ అదానీ ప్రపంచ కుబేరులలో మొదటి స్థానానికి చేర్చేందుకు దోహదపడ్డారన్నారు. సామాన్య ప్రజలపై పన్నుల భారాన్ని పెంచుతూ, కార్పొరేట్లకు జీఎస్టీ, ఎక్సైజ్, కస్టమ్స్, కార్పొరేట్ టాక్సులపై లక్షలాది, కోట్ల రూపాయల రాయితీలు ఇస్తున్నదని విమర్శించారు. మరోవైపు కార్మికుల హక్కులను హరిస్తు నాలుగు లేబర్ కోడ్ లను తీసుకువచ్చిందన్నారు. ఫలితంగా బడిస్తా ప్రభుత్వ ప్రజా ఉపాధి సంస్థ వాటిని తుందిని అందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ల లాభాలకు పెంపు ప్రజల సంపదలు లూటీ చేస్తున్న కార్పొరేట్లను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఉపాధి హామీ చట్టాన్ని నిరుపయోగంగా జిల్లాజిల్లా బిల్లులను తీసుకొచ్చి వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ పథకాన్ని దూరం చేసిందని పేర్కొన్నారు. నిరసన కార్యక్రమంలో రైతులు కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో సీఐటీయూ జి ల్లా ఉపాధ్యక్షులు ఓబుళమ్మ ప్రభావత్తమ్మ, వ్యవసాయ కార్మికులు నరసింహులు రమణ జయన్న దేవా అక్బర్ చంద్రశేఖర్ పద్మజ సుమలత సిద్దమ్మ శారద లు పాల్గొన్నారు

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి...
తెలుగు దినపత్రిక
07- 08 - 2026

# ప్రజల అవసరాలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తాం



**చిట్వేలి మన జనప్రగతి ఆగస్టు 06:-**గ్రామాలలో పర్యటించి ప్రజల అవసరాలు తెలుసుకొని వాటి పరిష్కారం కొరకు కృషి చేస్తామని రైల్వే కోడూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ బాధ్యులు ముక్కా రూపానంద రెడ్డి అన్నారు. చిట్వేలి మండలం నాగవరం, సీఎం రాచపల్లి పంచాయతీల పరిధిలోని గ్రామాలలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ముఖ్యంగా పెన్షన్లు, రేషన్ కార్డులు వంటి సమస్యలను గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకురాగా, సంబంధిత అధికారులతో సమన్వయం చేసి పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డిఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సెంట్రల్ స్మార్ట్ కిచెన్ నిర్మాణ పనుల నాణ్యతపై డీఈ సంతృప్తి



**సిద్ధవటం మన జనప్రగతి ఆగస్టు 06:-**సిద్ధవటంలో రూ.45 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సెంట్రల్ స్మార్ట్ కిచెన్ సెంటర్ పనుల నాణ్యత సంతృప్తికరంగా ఉందని రాజంపేట సబ్‌డివిజన్ క్వాలిటీ కంట్రోల్ డీఈ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన నిర్మాణ పనులను తనిఖీ చేసి బయోడైజెస్టర్, మినరల్ వాటర్ ప్లాంట్, గ్యాస్ యూనిట్, బయోగ్యాస్ వ్యవస్థ, సోలార్ యూనిట్, సీసీ కెమెరాలు, అంతర్గత డ్రైనేజీ, సీసీ రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కుకింగ్‌కు అవసరమైన పరికరాలు ఇంకా రావాల్సి ఉండగా, సివిల్ నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయని వెల్లడించారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ ఏఈఈ నరసింహారెడ్డి, పంచాయతీరాజ్ ఏఈఈ నాగరాజు, సైట్ ఇంజనీర్ హరికృష్ణ, కాంట్రాక్టర్ శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చెన్నూరు భవాని నగర్‌లో త్రాగునీటి పైప్ లైన్ లీకేజీ



**చెన్నూరు మన జన ప్రగతి ఆగస్టు 06:-**మండల కేంద్రమైన చెన్నూరు భవాని నగర్ లోని స్టేట్ బ్యాంకు వద్ద రెండు రోజులుగా త్రాగునీటి పైప్లైన్ లీకేజీ రావ డంతో నీరంతా బయటకు చిమ్ముతున్నది, ప్రక్కనే డ్రైనేజీ కలవడంతో నీరు కలుషితం అవుతుందన్న ఆందోళనలో స్థానిక ప్రజలు ఉన్నారు, గ్రామపంచాయతీ అధికారులు చొరవ తీసుకొని వెంటనే త్రాగునీటి పైప్ లైన్ లీకేజీ మరమ్మతులు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు, లేనిపక్షంలో డ్రైనేజీ నీటితో త్రాగునీరు కలుషితం అయ్యే ప్రమాదాలు ఉన్నాయని స్థానిక ప్రజలు భయపడుతున్నారు,


# విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు..అవగాహన

**బొమ్మనహాల్ మన జనప్రగతి ఆగస్టు 06:-**మండల పరిధిలో ఉంతకల్లు గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే)లో భాగంగా విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు,ఈ సందర్భంగా విద్యార్థుల ఎత్తు,బరువును పరీక్షించి,పౌష్టికాహారం తీసుకోవడం,ప్రతిరోజూ స్నానం చేసి పరిశుభ్రంగా పాఠశాలకు రావడం వారానికి ఒకసారి గోర్లు కత్తిరించుకోవడం,చేతులు శుభ్రంగా కడుక్కోవడం వంటి ఆరోగ్య అలవాట్లపై అవగాహన కల్పించారు,ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ బాగా చదివి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చంద్రనారాయణ,ఎంఎల్‌హెచ్‌పీ అఖిల,ఆరోగ్య కార్యకర్తలు శర్మస్ బి,గోవర్ధన్,ఆశా కార్యకర్తలు లక్ష్మీదేవి,వన్నూరమ్మ, పాల్గొన్నారు.



# సస్పెండ్ అయిన కనెక్షన్‌కు 15 లోపు ఈ కేవైసీ తప్పక చేయించుకోండి

● శ్రీ ప్రభాకర్ ఇండియన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ సివి సుబ్బారెడ్డి



**రామాపురం మన జనప్రగతి ఆగస్టు 06:-**శ్రీ ప్రభాకర్ ఇండియన్ గ్యాస్ వినియోగదారులు చాలామంది ఈ కేవైసీ కలిగి లేరని ఓఎంసీ కంపెనీ అధికారులు ఈ కేవైసీ లేక కనెక్షన్ను సస్పెండ్ చేయడం జరిగిందని సస్పెండ్ అయిన కనెక్షన్లకు ఈనెల 15వ తేదీ వరకు ఓఎంసీ గడువు ఇచ్చిందని అందువలన వినియోగదారులు సస్పెండ్ అయిన కనెక్షన్లు తిరిగి పునరుద్ధరించుటకు శ్రీ ప్రభాకర్ ఇండియన్ గ్యాస్ ఆఫీస్ హసనాపురం నందు సంప్రదించి ఈ కేవైసీ పూర్తి చేసుకుని తన కనెక్షన్ పునరుద్ధారించుకోవాలని శ్రీ ప్రభాకర్ ఇండియన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ సివి సుబ్బారెడ్డి తెలియజేశారు ఈనెల 15వ తేదీ వరకు ఈ కేవైసీ లేని ఎడల కనెక్షన్ పూర్తిగా రద్దు చేయడం జరుగుతుందని సి వి సుబ్బారెడ్డి తెలిపారు. 15వ తేదీ పైన ఈ కేవైసీ చేసినా వారికి సబ్సిడీ సిలిండర్ ఇవ్వడం సాధ్యం కాదని వారికి 16వ తేదీ తర్వాత 14.2 కేజీల కమర్షియల్ సిలిండర్ మాత్రమే ఇవ్వవచ్చని సి వి సుబ్బారెడ్డి తెలియజేశారు అందువలన ఈ అవకాశాన్ని రామాపురం వీరవల్లి మండల ప్రజలు 15వ తేదీ లోపల ఆఫీసు నందు సంప్రదించి ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకుని తమ కనెక్షన్ ను పునరుద్ధరించుకోవాలని సి వి సుబ్బారెడ్డి ఇండియన్ గ్యాస్ వినియోగదారులకు విజ్ఞప్తి చేశారు.


# భూ సమస్యల పరిష్కారానికి అర్జీలు సమర్పించండి: తహసీల్దార్ విజయ్‌కుమార్




**సిద్ధవటం మన జనప్రగతి ఆగస్టు 06:-**రెవెన్యూ భూ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు అర్జీలు సమర్పించి ప్రభుత్వ సేవలను వినియోగించుకోవాలని సిద్ధవటం మండల తహసీల్దార్ విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని మాధవరం-1 బంగారుపేట గ్రామంలోని శ్రీ కనకదుర్గ కళ్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించనున్న ప్రజా భూమి పరిష్కార వేదిక ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్, కడప ఆర్డీవోతో పాటు రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమ్మర్తి జగన్మోహన్‌రాజు, ఇతర అధికారులు కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. భూ సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో అర్జీలు సమర్పించాలని, అందిన దరఖాస్తులను నెల రోజుల వ్యవధిలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కార్యక్రమంలో మండల ఆర్ఐ నరసింహ ప్రసాద్, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

# పార్థసారథి జన్మదిన వేడుకలు సేవా కార్యక్రమాలతో నిర్వహణ

● వృద్ధాశ్రమంలో అన్నదానం.. ● నిరాశ్రయులకు పండ్లు,బ్రెడ్లు,ఎనర్జీ డ్రింక్స్ పంపిణీ



**సిద్ధవటం మన జనప్రగతి ఆగస్టు 06:-** మాధవరం-1 గ్రామానికి చెందిన మనఊరికోసం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో, సంస్థ సభ్యుడు జనసేన పార్టీ రాష్ట్ర చేనేత విభాగ వికాస కార్యదర్శి రాటాల రామయ్య కుమారుడు, వెంకట పార్థసారధి జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం కొత్తమాధవరం సమీపంలోని కాశినాయన వృద్ధాశ్రమంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేయడంతో పాటు దేవాలయాలు, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో ఉన్న నిరాశ్రయులు, యాచకులకు పండ్లు, బ్రెడ్లు, ఎనర్జీ డ్రింక్స్, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ అవ్వారు రవిశంకర్ మాట్లాడుతూ, పార్థసారధి జన్మదినాన్ని సేవా కార్యక్రమాల ద్వారా నిర్వహించడం సంతోషకరమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా పార్థసారధి కుటుంబ సభ్యులు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు సామల చెంగయ్య, వృద్ధాశ్రమ నిర్వాహకులు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# కొద్దిపాటి వర్షానికే జలమయమైన రహదారి..

● దోమల వ్యాప్తితో విషజ్వరాల భయం



**సిద్ధవటం మన జనప్రగతి ఆగస్టు 06:-**మండలంలోని వంతాటిపల్లి గ్రామంలో కొద్దిపాటి వర్షానికే ప్రధాన రహదారి జలమయమై చెరువును తలపిస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. రహదారిపై వర్షపు నీరు రోజుల తరబడి నిల్వ ఉండడంతో దోమలు విపరీతంగా పెరిగి, విషజ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన నాగ సుబ్బారెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వాలు మారినా గ్రామంలోని డ్రైనేజీ, రహదారి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించలేదన్నారు. నిల్వ నీటి కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దోమల వ్యాప్తితో డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని తెలిపారు. సంబంధిత అధికారులు వెంటనే గ్రామాన్ని సందర్శించి, నిల్వ నీటిని తొలగించి రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు పాల్గొన్నారు.

# మధ్యవర్తిత్వంతోనే కేసులు రాజీకి అవకాశం

● మధ్యవర్తిత్వం పై ప్రజలకు న్యాయవాదుల అవగాహన కార్యక్రమం




**పత్తికొండ మన జనప్రగతి ఆగస్టు 06:**కోర్టులో చాలా రోజులుగా పెండింగ్లో ఉన్న కేసులను మధ్యవర్తిత్వం ద్వారా రాజి చేసుకునేందుకు సులువైన మార్గమని, దానిని ప్రతి కక్షిదారుడు సద్వినియోగం చేసుకోవాలని, మధ్యవర్తిత్వ శిక్షణ పొందిన న్యాయవాదులు శ్రీనివాసరెడ్డి, భాస్కర్, బాల భాషలు అన్నారు. గురువారం కర్నూలు జిల్లా పత్తికొండలో మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి జోష్ణ దేవి ఆదేశాల మేరకు, కక్షిదారులకు మధ్యవర్తిత్వంపై అవగాహన కార్యక్రమంలో భాగంగా వారికి పాంప్లెట్లు పంచి, అవగాహన ర్యాలీ నిర్వహించారు.మధ్యవర్తిత్వాన్ని సద్వినియోగం చేసుకొని తమ కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాది సూరజ్ నబి, లక్ష్మీనారాయణ, లోకాదాలత్ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి నెల రెండో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం

● లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్.




**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి ఆగస్టు 06:-**శ్రీ వెంకటేశ్వర అరవింద్ కంటి హాస్పిటల్,తిరుపతి వారిచేఉచిత కంటి వైద్య శిబిరం ప్రతి నెల రెండో ఆదివారం నిర్వహించబడనున్నట్లుక్యాంప్ ఆర్గనైజర్ హరినాథ్ రెడ్డి తెలిపారు.ప్రతి నెల 2వ ఆదివారము డావ డి. లక్ష్మీప్రసాద్, ఎమ్మెస్., సివిల్ సర్జన్., సహాయ, సహకారంతో రాయచోటి హరినాథ వీధిలోని మల్టీస్పెషాలిటి హాస్పిటల్ నందుఉవ 8:00 గంవ నుండి 1:00 గంవ వరకు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ అఫ్ టౌన్ రాయచోటిఅధ్యక్షులు లయన్ యస్. రామాంజనేయ రెడ్డి, 9440011234కార్యదర్శి లయన్ ఇందాద్ అహమ్మద్, 7396714411కోశాధికారి లయన్ శ్రీనివాసులు (భూపతి), 9985775248క్యాంప్ ఆర్గనైజర్స్:లయన్ పి.యస్.హరినాధ రెడ్డి - 9701078269, లయన్ మిక్కిలినేని ప్రసాద్ నాయుడు - 9000890990 తదితరులు పాల్గొన్నారు.

# ఏటి గంగమ్మ అమ్మవారికి ఘనంగా 41వ రోజు మండల పూజలు



**సిద్ధవటం మన జనప్రగతి ఆగస్టు 06:-**మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలో వెలసిన శ్రీ ఏటి గంగమ్మ అమ్మవారికి గురువారం 41వ రోజు మండల పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా అమ్మవారికి గణపతి పూజ, కుంకుమార్చన, అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు.అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ప్రధాన అర్చకులు మధుసూదన్ శర్మ మాట్లాడుతూ...జూన్ 20న అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ అనంతరం 41వ రోజు మండల పూజలను నిర్వహించినట్లు తెలిపారు. సకాలంలో వర్షాలు కురిసి రైతులు సిరిసంపదలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు.టీడీపీ మాజీ పార్లమెంట్ ఉపాధ్యక్షులు పుత్త రామచంద్రయ్య మాట్లాడుతూ..గ్రామస్తులు,భక్తుల సహకారంతో మండల పూజా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు.టీటీడీ కాంట్రాక్టర్ శ్రీనివాసులరెడ్డిని శాలువాతో సత్కరించగా, ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.కార్యక్రమంలో ఏఈఓ ప్రభాకర్ రెడ్డి, అసెంబ్లీ అధికార ప్రతినిధి రామ్మోహన్ నాయుడు, జనసేన నాయకుడు అతికారి చిన్న వెంకటయ్య, ఆలయ నిర్వాహకులు, మునిగాళ్ల సుబ్బయ్య, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# లోకేష్ కలిసిన టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లిండ్ల మహేష్

**రామాపురం మన జనప్రగతి ఆగస్టు 06:-**తెలుగుదేశం పార్టీ విద్యాశాఖ మంత్రి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ కలిసిన టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లిండ్ల మహేష్ ఆదివారంమర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా రామాపురం మండలం పలు సమస్యలపై ఆయన దృష్టికి తీసుకువెళ్లినట్టు రామాపురం మండలం లో సరస్వతి పల్లె గ్రామంలో 1992లో ఎస్సీ రిజర్వేషన్లో సర్పంచ్ ఘన విజయం సాధించారు.ఈసారి 2026 లో నవంబర్లో స్థానిక ఎన్నికల్లో ఎస్సీ రిజర్వేషన్ ఇవ్వాలని నారా లోకేష్ అన్న కి చెప్పడం జరిగింది. ఈ విషయంపై నియోజకవర్గంలో టిడిపి ఘనవిజయం సాధించడం సంతోష్మన్నారు రాయచోటి నియోజకవర్గం ఎమ్మెల్యే రాయచోటి నియోజవర్గం అభివృద్ధి ముందుకు సాగుతోందనీ రోడ్లు బోర్లు ప్రతి గ్రామంలో త్రాగునీరు సమస్య లేకుండా చేయడం జరిగిందనీ. ప్రజలు కూడా సంతోషం వ్యక్తం చేశారు.ప్రతి మండలంలో సమస్య లేకుండా ముందుకు సాగుతున్నారనీ. ప్రజానాయకుడు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అని మంత్రివర్యులు ప్రజల్లో ఉంటూ ప్రతి సమస్య వచ్చినా నేను ఉన్నాను చెప్పిన ఘనత మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి దక్కుతుందని 2029లో తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించి క్యాబినెట్ లోకి పంపిస్తాం అని నారా లోకేష్ కి మాట చెప్పడం జరిగిందనీ తెలిపాడు.



మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
07- 08 - 2026

# 6 నుండి 15 వరకు సిపిఐ పాదయాత్రను జయప్రదం చేద్దాం



**చిట్వేలి మన జనప్రగతి ఆగస్టు 06:-** గత 12 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని సిపిఐ చిట్వేలి మండల పార్టీ నాయకులు తిప్పన ప్రసాద్ అన్నారు. చిట్వేలి మండలం మాలేమార్పురం పంచాయతీలో ఈనెల 6 వ తేదీ నుండి 15వ తేదీ వరకు ప్రజల సమస్యల కోసం పాదయాత్ర చేయాలని కర పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ గ్రామాన ప్రచార కార్యక్రమాలు నిర్వహించి, సెప్టెంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో మహా ర్యాలీ చేపట్టనున్నట్లు తెలిపారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, రైతులకు చట్టబద్ధమైన కనీస మద్దతు ధర హామీ కల్పించాలని కోరారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని ఆయన డిమాండ్ చేశారు. దేశ సంపదను కొద్దిమంది కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయడంలో కూడా కేంద్ర ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. కార్మికుల ఎనిమిది గంటల పనిదినాన్ని 12 గంటలకు పెంచే చర్యలు కార్మిక హక్కులపై దాడిగా అభివర్ణించిన ఆయన, మహిళలపై పెరుగుతున్న దాడులను అరికట్టడంలో కూడా కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. మార్పు రావాలి మార్పు అనివార్యం నినాదంతో ఆగస్టు 6 నుంచి 15 వరకు దేశవ్యాప్తంగా గ్రామాలు, పట్టణాల్లో పాదయాత్రలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించి, సెప్టెంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో మహా ర్యాలీ చేపట్టనున్నట్లు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం ముందు రాష్ట్ర హక్కులను సాధించడంలో విఫలమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో ముద్దిని శేఖర్, పుల్లయ్య వెంకటరమణ, నాగయ్య, నారాయణ, పోతయ్య, సురేష్, రవణమ్మ, కిష్టమ్మ. చిట్టెమ్మ, సిపిఐ నాయకులు పాల్గొన్నారుద

# ఎల్ నినో పరిస్థితులపై జిల్లా స్థాయి సమీక్షలో ఎమ్మెల్యే



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి ఆగస్టు 06:-**జిల్లాలో సంభవించే ఎల్ నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన ప్రత్యామ్నాయ సన్నద్ధత చర్యలపై కడప కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి పాల్గొన్నారు.సమావేశంలో జిల్లా కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలో ప్రస్తుత వర్షపాతం పరిస్థితులు, భూగర్భ జలాల స్థితి, జలాశయాల్లో నీటి నిల్వలు, ఖరీఫ్ సాగు పురోగతితో పాటు ప్రభుత్వం చేపడుతున్న నివారణ చర్యలను సమగ్రంగా వివరించారు. అనంతరం సంబంధిత శాఖల జిల్లా అధికారులు ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తీసుకుంటున్న ప్రత్యామ్నాయ కార్యాచరణ, ముందస్తు సన్నద్ధత చర్యలు, శాఖల వారీగా అమలు చేస్తున్న ప్రణాళికలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.ఈ సమావేశంలో ప్రభుత్వ విప్,జమ్మలమడుగు ఎమ్మెల్యే సి.ఆదినారాయణ రెడ్డి,కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్య రెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్ నిధి మీనా, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలే తెలంగాణ అభివృద్ధికి మార్గదర్శకం: బండి రమేష్



**కూకట్‌పల్లి మన జనప్రగతి ఆగస్టు 06:-**తెలంగాణ రాష్ట్ర సాధనకు జీవితాంతం అంకితభావంతో పోరాడిన మహనీయుడు, తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, టీపీసీసీ ఉపాధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ అన్నారు.ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా మూసాపేట్ ఆంజనేయ నగర్‌లో ఏర్పాటు చేసిన ఆయన విగ్రహానికి బండి రమేష్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి సిద్ధాంతపరమైన బలాన్ని అందించి, ప్రజల్లో ఆత్మగౌరవం, స్వాభిమానాన్ని పెంపొందించిన మహోన్నత వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ ని కొనియాడారు. మలిదశ తెలంగాణ ఉద్యమానికి బీజం వేసి, గ్రామం నుంచి నగరం వరకు ప్రతి తెలంగాణవాసి హృదయంలో ఉద్యమ జ్వాలను రగిలించిన మహనీయుడిగా ఆయన చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు.తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా చివరి శ్వాస వరకు అవిశ్రాంతంగా శ్రమించిన జయశంకర్ సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన కలలుగన్న సమానత్వ తెలంగాణను నిర్మించడం, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడం ద్వారానే ఆయనకు నిజమైన నివాళి అర్పించిన వారమవుతామని బండి రమేష్ అన్నారు.ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, నాగిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేశాల్, సంతోష్, గోవింద్, బాలరాజు, నర్సింగరావు, ప్రభాకర్, సలీం, లక్ష్మీనారాయణ, యాదగిరి, ప్రకాష్, వాసు తదితరులు పాల్గొన్నారు.

# సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్లో ప్రొఫెసర్ జయశంకర్‌కి ఘన నివాళులు



**సైబరాబాద్ మన జనప్రగతి ఆగస్టు 06:-** ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా నేడు సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా.ఎం.రమేష్ ఐపీఎస్ మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ జీవితాంతం చేసిన కృషి, ఆయన సిద్ధాంతాలు, ప్రజల పట్ల ఉన్న అంకితభావం అందరికీ ఆదర్శప్రాయమని అన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ అన్నపూర్ణ, క్రైమ్స్ డీసీపీ ముత్యం రెడ్డి, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్‌తో పాటు ఇతర పోలీసు అధికారులు పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.

# ఆగస్టు 15 నాటికి ప్లాస్టిక్ రహిత ప్రొద్దుటూరు..!

## ●ప్రజల సహకారంతో స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దుదాం:ఎమ్మెల్యే



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి ఆగస్టు 06:**ప్రొద్దుటూరును ప్లాస్టిక్ రహిత, పరిశుభ్రమైన పట్టణంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి అన్నారు.ప్రొద్దుటూరు పురపాలక సంఘం మెప్మా ఆధ్వర్యంలో అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ నుంచి శివాలయం సెంటర్ వరకు ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి తీవ్ర హాని కలుగుతోందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా మానుకుని పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వచ్చే ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం నాటికి ప్రొద్దుటూరును స్వచ్ఛమైన, ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తూతిక శ్రీనివాస్ విశ్వనాథం, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మున్సిపల్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

# పులివెందుల శిల్పారామంలో స్టాల్స్ కేటాయింపు

## అర్హులైన చేనేత, హస్తకళాకారుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం




**పులివెందుల అర్బన్ మన జనప్రగతి ఆగస్టు 06:**స్థానిక శిల్పారామంలో ఖాళీగా ఉన్న స్టాల్స్‌ను కేటాయించేందుకు అర్హులైన హస్తకళాకారులు (హ్యాండీక్రాఫ్ట్ ఆర్టిసన్స్ ), చేనేత కార్మికుల (వీవర్స్ ) నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు శిల్పారామం పరిపాలనాధికారి బి.సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు.చేనేత,హస్తకళల ఉత్పత్తులకు సరైన మార్కెటింగ్ సదుపాయం కల్పించడంతో పాటు, కళాకారులకు నిలకడైన ఉపాధి అవకాశాలు అందించడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ శిల్పారామం సొసైటీ ఈ నిర్ణయం తీసుకుందని ఆయన పేర్కొన్నారు.దరఖాస్తుకు కావాల్సిన పత్రాలుఆధార్ కార్డు నకలు (జిరాక్స్ ),ప్రభుత్వం జారీ చేసిన ఆర్టిసన్ / వీవర్ గుర్తింపు కార్డు,తయారు చేసే ఉత్పత్తుల వివరాలు లేదా నమూనాలు (సాంపిల్స్ )ఫోన్ / మొబైల్ నంబర్.అందిన దరఖాస్తులను పరిశీలించిన అనంతరం, సొసైటీ నిబంధనల మేరకు 'మొదట వచ్చిన వారికి మొదటి ప్రాధాన్యత' (ఫస్ట్ కం , ఫస్ట్ సర్వడ్ ) లేదా మెరిట్ ఆధారంగా స్టాల్స్ కేటాయింపు ఉంటుందని పరిపాలనాధికారి స్పష్టం చేశారు.అర్హులైన కళాకారులు తమ దరఖాస్తులను పులివెందుల శిల్పారామం పరిపాలనాధికారికి సమర్పించాలని కోరారు.

# శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు డిమాండ్

## - నేడు న్యాయవాదుల విధుల బహిష్కరణ.




**కర్నూలు బ్యూరో మన జనప్రగతి ఆగస్టు 06:-**కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా వ్యాప్తంగా న్యాయవాదులు నేడు (శుక్రవారం) విధులను బహిష్కరించాలని నిర్ణయించారు. స్థానిక కొత్తపేటలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో ఉన్న న్యాయవాదుల సంఘం భవనంలో గురువారం అత్యవసర జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బి. చంద్రుడు మాట్లాడుతూ గత నెలలో ఆదోనిలో జరిగిన సభలో 90 రోజుల్లో కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని మంత్రి నారా లోకేష్ ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. అయితే, దానిని కేవలం 'క్యాంప్' లేదా 'సర్క్యూట్' బెంచ్‌కే పరిమితం చేసే ప్రయత్నాలు ఇటీవల ఒక పత్రికలో దాన్ని కేవలం 'క్యాంప్' లేదా 'సర్క్యూట్' బెంచ్‌కే పరిమితం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని వార్త రావడం ద్వారా న్యాయవాదులు ఆందోళన చెందారని, అలాగే తాత్కాలిక స్వభావం కలిగిన బెంచ్‌లు రాయలసీమ ప్రజల ఆకాంక్షలను ఏమాత్రం నెరవేర్చలేవని, కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్ మాత్రమే ఏర్పాటు చేయాలని ఆయన స్పష్టంగా డిమాండ్ చేశారు. 1937 చారిత్రాత్మక శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం రాష్ట్ర రాజధాని ఒక ప్రాంతంలో ఉంటే, ఉన్నత న్యాయస్థానం (హైకోర్టు) మరొక ప్రాంతంలో ఉండాలని పేర్కొన్నారు. అన్ని వ్యవస్థలను ఒక్క రాజధాని ప్రాంతంలోనే కేంద్రీకరిస్తే రాయలసీమ తీవ్రంగా నష్టపోతుందని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కర్నూలులో శాశ్వత బెంచ్ ఏర్పాటుకు అధికారిక చర్యలు వేగవంతం చేయాలని కోరారు.

# ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయం

## ●ఏపీ ఎన్జీవో రాష్ట్ర నాయకులకు వినతులు

## అందించిన పులివెందుల నేతలు




**విజయవాడ మన జనప్రగతి ఆగస్టు 06:**విజయవాడలోని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ భవనంలో ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్,రాష్ట్ర జనరల్ సెక్రటరీ డి.వి.రమణలను పులివెందుల తాలూకా ప్రెసిడెంట్ గజ్జల జగన్నాథ్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ భేటీలో రాష్ట్ర పట్టు పరిశ్రమ ఉద్యోగుల సంఘం జనరల్ సెక్రటరీ సి.ఎస్.విజయ్ కుమార్, ట్రెజరర్ టి.చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు పి.వి.రమణయ్య తదితరులు పాల్గొన్నారు.ఉద్యోగుల సమస్యలపై సానుకూల స్పందనఈ సందర్భంగా పులివెందుల తాలూకాలోని ఉద్యోగుల సంక్షేమం,వారు ఎదుర్కొంటున్న పలు సమస్యలు మరియు వినతులను రాష్ట్ర అధ్యక్షులకు నాయకులు సవివరంగా తెలియజేశారు. ఉద్యోగుల విన్నపాలపై స్పందించిన రాష్ట్ర నాయకత్వం,సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించడం జరిగింది.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉద్యోగుల శ్రేయస్సు కోసం అనునిత్యం పోరాటం చేస్తున్న ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ కి,రాష్ట్ర జనరల్ సెక్రెటరి డి.వి.రమణ కి ఈ సందర్భంగా పులివెందుల తాలూకా ఏపీ ఎన్జీవో ప్రెసిడెంట్ గజ్జల జగన్నాథ్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన ర్యాలీ



**బొమ్మనహాల్ మన జనప్రగతి ఆగస్టు 06:-**శ్రీధరఘట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఏలంజి గ్రామ ప్రజలకు సీజనల్ వ్యాధుల నివారణపై విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు,ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. డెంగ్యూ,మలేరియా,టైఫాయిడ్, వ్యాధి లాంటి నియంత్రణకు ముందుగా దోమల పుట్టుకను అరికట్టాలని ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడడంతో పాటు దోమతెరలు వినియోగించాలని సూచించారు,అలాగే డయేరియా,కరోనా వంటి వ్యాధుల నివారణకు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం,కాచి చల్లార్చిన నీరు తాగడం, తాజాగా వండిన ఆహారం తీసుకోవడం,బయట ఆహార పదార్థాలను తినకుండా ఉండాలని ప్రజలకు అవగాహన కల్పించారు,అనంతరం దోమల లార్వా నిర్మూలన కోసం "అబేట్" ద్రావణాన్ని పిచికారీ చేశారు,ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ బాలాజీ,ఆరోగ్య కార్యకర్తలు, నాగరత్నమ్మ,వెంకటరమణ, మస్తాన్,జయరాజు,ఆశా కార్యకర్తలు నాగమణి,మరియు విద్యార్థులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పాత కడమలకుంట అంగన్వాడి కేంద్రంలో "తల్లిపాల వారోత్సవాలు విజయవంతం"



**వజ్రకరూరు మన జనప్రగతి ఆగస్టు 06:-**పాత కడమలకుంట అంగన్వాడి కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యత, నవజాత శిశువులకు మొదటి ఆరు నెలల పాటు తల్లిపాలే ఉత్తమ ఆహారమని, తల్లిపాలు శిశువుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు, వ్యాధి నిరోధక శక్తి పెంపొందించడానికి ఎంతగానో దోహదపడతాయని గ్రామంలోని బాలింతలకు, గర్భిణులకు, ప్రజలకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు అనసూయమ్మ, సుంకమ్మ, అంగన్వాడి సహాయకులు శివలక్ష్మి, శ్రావణి పాల్గొని తల్లిపాల వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. అలాగే బాలింతలు తల్లిపాల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామంలోని బాలింతలు, గర్భిణులు, మహిళలు, ప్రజలు పాల్గొని తల్లిపాలపై అవగాహన పెంపొందించుకున్నారు .

# విజయవాడలో 'పవర్' సినిమాకు క్లాప్ కొట్టి ప్రారంభించిన మంత్రి కందుల దుర్గేష్



**విజయవాడ మన జనప్రగతి ఆగస్టు 06:-** విజయవాడలోని ఘంటసాల ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల ప్రాంగణంలో చిన్న సినిమాగా రూపొందుతున్న "పవర్" చిత్రం గురువారం నాడు ప్రారంభమైంది. వీఆర్పీ క్రియేషన్స్ పతాకంపై వెంకటరమణ పసుపులేటి దర్శకత్వంలో పరిమిత బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిన్న సినిమా ముహూర్తపు సన్నివేశానికి రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ కెమెరా స్విచ్ ఆన్ చేసి, తొలి క్లాప్ కొట్టారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. పరిమిత బడ్జెట్‌తో నూతన ఆలోచనలతో వస్తున్న 'పవర్' చిత్రం పెద్ద విజయం సాధించాలని ఆకాంక్షించారు. చిత్రయూనిట్‌కు తన ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ, సినిమా విజవంతం కావాలని శుభాకాంక్షలు అందజేశారు.



మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
07- 08 - 2026

# రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు గజ్జల వెంకటేశ్వర రెడ్డికి ఘన సన్మానం



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి ఆగస్టు 06:-**రోటరీ క్లబ్ ఆఫ్ ప్రొద్దుటూరు మాజీ అధ్యక్షుడు, రొటేరియన్ పీహెచ్ఎఫ్ గజ్జల వెంకటేశ్వర రెడ్డిని క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. 202526 సంవత్సరంలో రోటరీ సేవలను సమాజంలోని అన్ని వర్గాలకు చేరేలా విస్తృతంగా నిర్వహించి, క్లబ్‌కు ఉత్తమ రోటరీ క్లబ్ అవార్డుతో పాటు మొత్తం ఏడు అవార్డులు సాధించడంలో కీలక పాత్ర పోషించినందుకు ఈ సత్కారం నిర్వహించారు. బుధవారం రాత్రి రోటరీ క్లబ్ సమావేశ భవనంలో జరిగిన కార్యక్రమంలో ప్రస్తుత అధ్యక్షుడు కొవ్వూరు రమేష్ రెడ్డి, కార్యదర్శి గండ్లూరు శ్రీధరశర్మ ఆధ్వర్యంలో గజ్జల వెంకటేశ్వర రెడ్డిని శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రమేష్ రెడ్డి మాట్లాడుతూ, గజ్జల వెంకటేశ్వర రెడ్డి తన పదవీకాలంలో నిర్దిష్ట ప్రణాళికతో రోటరీ చరిత్రలో ఎన్నో వినూత్న కార్యక్రమాలు చేపట్టి క్లబ్ ప్రతిష్ఠను మరింత పెంచారని కొనియాడారు. ఆయన నాయకత్వంలో క్లబ్‌కు ఏడు అవార్డులు రావడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ ఏడాది కూడా సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తూ ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.సన్మానానికి స్పందించిన గజ్జల వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ, తనకు అప్పగించిన బాధ్యతలను క్లబ్ సభ్యులందరి సహకారంతో నిబద్ధతతో నిర్వహించానని చెప్పారు.లభించిన అవార్డులు ఒక్కరి కృషి ఫలితం కాదని,రోటేరియన్స్ అందరి సమిష్టి కృషికి గుర్తింపుగా భావిస్తున్నానన్నారు. ప్రస్తుత సంవత్సరం రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్3160లో ప్రొద్దుటూరు రోటరీ క్లబ్ 20 అవార్డులు సాధించి ప్రథమ స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. ఈ సేవా ప్రయాణంలో తనకు సహకరించి, ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# నోటు పుస్తకాలు పంపిణీ చేసిన హరిత ఫౌండేషన్






**పోరుమామిళ్ల/కాశినాయన మన జనప్రగతి ఆగస్ట్ 06:-** కాశినాయన మండలంలోని రెడ్డి కొట్టాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హరిత ఫౌండేషన్ సహకారంతో గురువారం హెచ్ఎం వాకా చంద్రశేఖర్, పిఎస్ హెచ్ఎం ఖదీర్ భాష చేతులమీదుగా 80 మంది విద్యార్థులకు 300 నోటు పుస్తకాలను అందచేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ ,ఖదీర్ భాష ,వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ...హరిత ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఫణి రాజకుమార్ పేద విద్యార్థుల కోసం నోటు పుస్తకాలు అందించి సహకరించడం హర్షించదగ్గ విషయమన్నారు. మై వాయిస్ కో -ఆర్డినేటర్, రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పరిమళ జ్యోతి మాట్లాడుతూ...హరిత ఫౌండేషన్ ద్వారా రెండు తెలుగు రాష్ట్రాల్లో పేద విద్యార్థుల విజ్ఞానాభివృద్ధి కోసం పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న చైర్మెన్ ఫణి రాజ్ కుమార్ సేవలు అభినందనీయం అన్నారు. లేవండి, మేల్కొనండి మీ లక్ష్యాన్ని చేరేవరకు ఆగకండి అని స్వామి వివేకానంద చెప్పిన విషయాన్ని పరిమళ జ్యోతి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదా పీర్,వెంకటసుబ్బయ్య, భాష,దేవరాజు, సావిత్రి, శ్రీలత ,విజయలక్ష్మి, మహేష్, సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయి ఎల్ నినో ప్రభావం..

## - రైతులకు శాస్త్రవేత్తలు,వ్యవసాయ శాఖ అవగాహన




**సింహాద్రిపురం మన జనప్రగతి ఆగస్టు 06:-** ఎల్ నినో వల్ల ఏర్పడుతున్న వర్షాభావ పరిస్థితులను తట్టుకునేలా రైతులకు అవగాహన కల్పించేందుకు కేవీకే ఊటుకూరు, పులివెందుల వ్యవసాయ కళాశాల మరియు వ్యవసాయ శాఖ సంయుక్తంగా సింహాద్రిపురం మండలంలోని సుంకేసుల, దిద్దికుంట గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాయి.వర్షాలు లేక తేమ కొరతతో పంట వాడిపోవడం,ఆకు పేను, జాసిడ్స్ మరియు కాయ తొలిచే పురుగు (హెలికోవర్పా) ఆశించడం,జాసిడ్స్,అఫిడ్స్,తెల్ల దోమ వంటి రసం పీల్చే పురుగుల ఉధృతి మీద అవగాహనా కల్పించారు.తక్కువ కాలవ్యవధిలో పండే కంది,కొర్ర,మినుము,ఉలవ వంటి పంటలు మరియు అంతర పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.ప్రతి 3 మీటర్లకు కన్జర్వేషన్ ఫర్రో తీయడం,మల్చింగ్ మరియు బిందు సేద్యం పాటించాలన్నారు.పూత,కాయ నిలుపుదల కోసం 2 శాతం డి.ఏ.పి లేదా 1శాతం 13:0:45 ద్రావణాన్ని ఆకులపై పిచికారీ చేయాలని వేరుశనగ,పత్తి, నిమ్మ మరియు అరటి పంటలలో ఆశించే పురుగులు,తెగుళ్ల నివారణకు తగిన పురుగుమందులు,పసుపు/ఫెరోమోన్ బోన్లు మరియు జీవ నియంత్రణ కారకాలను ఉపయోగించాలన్నారు.ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా.కృష్ణప్రియ,డా.మానస,ఎంఏఓ మధుసూదన్ రెడ్డి, వ్యవసాయ కళాశాల అధ్యాపకులు,విద్యార్థులు మరియు 100 మందికి పైగా రైతులు పాల్గొన్నారు.

# డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు

## - వైకాపా యువజన విభాగం అధ్యక్షుడు రామ్ లక్ష్మణ్ రెడ్డి




**పులివెందుల అర్బన్ మన జనప్రగతి ఆగస్టు 06:**డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరగాలి,న్యాయం జరిగే వరకూ మా పోరాటం ఆగదు అని యువజన విభాగం అధ్యక్షుడు రామ్ లక్ష్మణ్ రెడ్డి అన్నారు.వైకాపా అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు వైఎస్ అవినాష్ రెడ్డి నాయకత్వంలో పులివెందుల ఆర్డీవో కార్యాలయం ఎదురుగా రిలే నిరాహార దీక్షలు చేపట్టారు.రామ్ లక్ష్మణ్ రెడ్డి మాట్లాడుతూ డిఎస్సి నియామకాల్లో అక్రమాలు జరగడంతో అభ్యర్థులకు అన్యాయం జరిగిందన్నారు.విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్,నిరుద్యోగ భృతి పై ప్రభుత్వం దృష్టి సాధించాలని కోరారు.అభ్యర్థులు,నిరుద్యోగుల హక్కుల సాధన కోసం వైకాపా యువజన విభాగం ఎల్లప్పుడూ ముందుంటుందని ఈ సందర్భంగా నాయకులు స్పష్టం చేశారు.

# ఓటర్ల ఇబ్బందులు తొలగించాలి

- గ్రామాల వద్దనే 'ప్రత్యేక విచారణ క్యాంప్‌లు' ఏర్పాటు చేయాలి
- ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారికి వైఎస్సార్‌సీపీ నాయకుల వినతి



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి ఆగస్టు 06:**పులివెందుల నియోజకవర్గంలో వివిధ కారణాలతో నోటీసులు పొందిన ఓటర్ల సౌకర్యార్థం గ్రామాల స్థాయిలోనే విచారణ పూర్తి చేసి వివరాలు సేకరించేలా 'ప్రత్యేక క్యాంప్‌లు' నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు.ఈ మేరకు గురువారం ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి (ఈ ఆర్ఓ) కి వినతిపత్రాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న 309 పోలింగ్ కేంద్రాల్లో కొన్నిచోట్ల వందకు పైగా ఓటర్లకు నోటీసులు వచ్చాయని తెలిపారు.నోటీసులు పొందిన వారు ప్రతిసారీ ఆధారాల సమర్పణ కోసం మండల కార్యాలయాలకు రావడం వల్ల తీవ్ర రవాణా ఇబ్బందులు,ఆర్థిక భారం ఎదుర్కొంటున్నారు.ముఖ్యంగా వృద్ధులు,మహిళలు,దివ్యాంగులు మరియు రోజువారీ కూలీలు మండల ఆఫీసుల చుట్టూ తిరగడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.100కి పైగా నోటీసులు వచ్చిన గ్రామాల్లో ఎఈ ఆర్ఓ,బిఎల్ఓ ల ఆధ్వర్యంలో ఒక నిర్దిష్ట రోజున 'ప్రత్యేక క్యాంప్' ఏర్పాటు చేయాలి.అధికారులే నేరుగా గ్రామాల వద్దకు వచ్చి ఓటర్ల నుండి పత్రాలను సేకరించి,పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో పులివెందుల టౌన్ ప్రెసిడెంట్ హాల్ గంగాధర్ రెడ్డి, సీనియర్ నాయకులు కడియాల లక్ష్మీనారాయణ,మాజీ నూర్ బాషా సంఘం అధ్యక్షుడు ఓ.రసూల్,ఐటీ వింగ్ శివప్రసాద్,కొంగనపల్లి మురళి,మున్సిపాలిటీ మాజీ కో-ఆప్షన్ సభ్యుడు దాసరి చంద్రమౌళి,జిల్లా జనరల్ సెక్రెటరీ తోటంశెట్టి హరికృష్ణ, వెంగల్‌రాయుడు,తొండూరు మండల నాయకులు శ్రీను, సింహాద్రిపురం మండల నాయకులు రుషి, ఈశ్వయ్య,భాస్కర్ రెడ్డి తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

# అన్ని విభాగాలు సమన్వయంతో బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి

## - టీటీడీ అదనపు ఈ.ఓ సి.హెచ్. వెంకయ్య చౌదరి



**తిరుమల మన జనప్రగతి ఆగస్టు 06:-** శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలను సెప్టెంబర్ 15 నుండి 23వ తేదీ వరకు తిరుమలలో వైభవంగా నిర్వహించనున్న నేపథ్యంలో అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి ఉత్సవాలను విజయవంతం చేయాలని టీటీడీ అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి అధికారులను ఆదేశించారు.తిరుమల పద్మావతి అతిథి గృహంలోని సుధర్మ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన బ్రహ్మోత్సవాల సమీక్ష సమావేశంలో ఆయన, టీటీడీ జేఈవో డాక్టర్ ఏ.శరత్, సీవీఎస్వో మురళీకృష్ణ, తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బారాయుడుతో కలిసి వివిధ శాఖల ఏర్పాట్లపై సమగ్రంగా సమీక్షించారు.ఈ సందర్భంగా అదనపు ఈవో మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ బస్సుల సంఖ్యను అవసరానికి అనుగుణంగా పెంచాలని సూచించారు. వాహనాల పార్కింగ్‌లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందుగానే పార్కింగ్ స్థలాలను కేటాయించి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పార్కింగ్ నిర్వహణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని ఆదేశించారు.చిన్నారులు తప్పిపోకుండా చైల్డ్ ట్యాగ్‌ల పంపిణీని విస్తృతంగా చేపట్టాలని అధికారులకు సూచించారు.విద్యుత్ కేబుళ్లు, తాత్కాలిక విద్యుత్ వ్యవస్థల విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.ముఖ్యంగా గరుడ వాహనం, చక్రస్నానం రోజున అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యే నేపథ్యంలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమగ్ర ఏర్పాట్లు చేయాలని సూచించారు.అదేవిధంగా అగ్నిప్రమాదాల నివారణకు అవసరమైన అన్ని చర్యలను ముందుగానే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అనంతరం తిరుపతి జేఈవో మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుపతిలో చేయాల్సిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో ఇప్పటికే సమావేశం నిర్వహించి పలు సూచనలు చేసినట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో 25 రాష్ట్రాలకు చెందిన కళా బృందాలతో పాటు సింగపూర్, జర్మనీ నుండి కూడా కళా బృందాలు విచ్చేసేలా చర్యలు చేపట్టామని తెలియజేశారు. సీవీఎస్వో, జిల్లా ఎస్పీ బ్రహ్మోత్సవాల్లో భద్రతా పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో టీటీడీ ఇన్ ఛార్జ్ సీఈ మనోహరం, డిప్యూటీ ఈవోలు రాజేంద్ర, భాస్కర్, సీఎంఓ డాక్టర్ కుసుమ కుమారి, డీఎఫ్వో ఫణి కుమార్ నాయుడు, తిరుమల ఏఎస్పీ రామకృష్ణ, వీజీవో శ్రీ సురేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# యోగి వేమన విశ్వవిద్యాలయ విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి:టీఎన్ఎస్ఎఫ్



**కడప మన జనప్రగతి ఆగస్టు 06:-** యోగి వేమన విశ్వవిద్యాలయంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ గురువారం విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ గారికి టీఎన్ఎస్ఎఫ్ కడప జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేష్ వినతిపత్రాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా తిరుమలేష్ మాట్లాడుతూ,విశ్వవిద్యాలయంలో విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, విద్యా సౌకర్యాలు మరియు మౌలిక వసతుల విషయంలో పలు సమస్యలు కొనసాగుతున్నాయని, వాటిని అత్యవసరంగా పరిష్కరించాలని కోరారు.టీఎన్ఎస్ఎఫ్ ప్రధాన సమస్యలువర్షాకాలంలో పాములు, తేళ్లు వంటి విషజంతువుల బెడద నివారణకు హాస్టల్ పరిసరాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, పొదల తొలగింపు, చెత్త తొలగింపు, ఫాగింగ్ కార్యక్రమాలను వెంటనే చేపట్టాలి.వైవీయూ హాస్టల్ నుండి ఆర్ట్స్ బ్లాక్ వరకు విద్యార్థుల రాకపోకలకు బస్సు సౌకర్యం కల్పించాలి.విద్యార్థుల విద్యా అవసరాల కోసం హాస్టళ్లలో హై-స్పీడ్ వైఫై సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురావాల నీ కోరారు.హాస్టళ్లలోని స్నానపు గదులు, తలుపులు, సింకులు, కుళాయిలు, స్విచ్ బోర్డులు, ఫ్లోరింగ్ తదితర మౌలిక సదుపాయాలకు తక్షణమే మరమ్మతులు చేపట్టి మెరుగైన వసతులు కల్పించాలి.మెస్‌లో నాణ్యమైన, పరిశుభ్రమైన, పోషకాహార భోజనం అందేలా విశ్వవిద్యాలయ యాజమాన్యం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు,విద్యార్థుల సంక్షేమం, భద్రత మరియు విద్యా అభివృద్ధి పట్ల విశ్వవిద్యాలయ యాజమాన్యం బాధ్యతాయుతంగా స్పందించి, పై సమస్యలన్నింటినీ అత్యవసరంగా పరిష్కరించాలని కోరారు.విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం టీఎన్ఎస్ఎఫ్ నిరంతరం పోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైవియు టీఎన్ఎస్ఎఫ్ నాయకులు భరత్ సింహా, అమృత్ కుమార్, కళ్యాణ్, జస్వంత్, కుమార్ రాజా, వంశీ, హేమంత్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి విజయవాడకు జిల్లా నాయకుల పయనం



**అనంతపురం మన జనప్రగతి ఆగస్టు 06:-**విజయవాడలో నిర్వహించనున్న భారతీయ జనతా పార్టీ (బీజేపీ) గిరిజన మోర్చా రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి హాజరయ్యేందుకు అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలకు చెందిన గిరిజన మోర్చా నాయకులు గురువారం అనంతపురం నుంచి విజయవాడకు బయలుదేరారు.రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశంలో గిరిజన సంక్షేమం, పార్టీ సంస్థాగత బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ, గ్రామస్థాయి వరకు పార్టీ విస్తరణతో పాటు గిరిజన ప్రాంతాల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించనున్నట్లు నాయకులు తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా గిరిజన మోర్చా పదాధికారులు, జిల్లా నాయకులు ఈ సమావేశంలో పాల్గొంటారని, పార్టీ బలోపేతానికి దోహదపడే కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని గిరిజన మోర్చా జిల్లా నాయకుడు మూడ్ కేశవ్ నాయక్ తెలిపారు.

# వసతి గృహాల పర్యవేక్షణ నిత్యం సాగాలి

## విద్యార్థులకు అసౌకర్యం లేకుండా చూడాలి

## వి.సి.ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్



**కడప మన జనప్రగతి ఆగస్టు 06:-** వసతి గృహాల పర్యవేక్షణ నిత్యం సాగాలి. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చూడాలని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ అన్నారు. వసతి గృహాల సంక్షేమ అధికారులతో, హాస్టల్ సిబ్బందితో వి.సి తన చాంబర్లో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వి.సి. మాట్లాడుతూ విద్యార్థులను సొంత బిడ్డల్లా చూసుకోవాలన్నారు. ఆహార పదార్థాలు నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వలదన్నారు. విమర్శకులకు చోటు కల్పించవద్దని స్పష్టం చేశారు. అందరూ కష్టపడి పని చేయాలని ఉద్బోధించారు. వార్డెన్లు రోజూ వసతి గృహాలను సందర్శించాలని సూచించారు.ప్రిన్సిపల్ ,వసతి గృహాల చీఫ్ వార్డెన్ ప్రొఫెసర్ టి శ్రీనివాస్,రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి పద్మ, వార్డెన్ లు సిబ్బంది పాల్గొన్నారు,

# ప్రతాప్‌రెడ్డి అకాల మరణం అందరినీ కలచివేసింది

## కుటుంబ సభ్యులను పరామర్శించిన నాగెళ్ళ సాంబశివారెడ్డి

## భౌతికకాయానికి నివాళులర్పించిన వైఎస్సార్సీపీ నాయకులు



**వేముల మన జనప్రగతి ఆగస్టు 06:-**వేముల మండలం గొల్లలగూడూరు గ్రామానికి చెందిన వైఎస్సార్సీపీ సీనియర్ నాయకులు నాగెళ్ళ వీరారెడ్డి కుమారుడు నాగెళ్ళ ప్రతాప్‌రెడ్డి అకాల మరణం అందరినీ కలచివేసింది.గురువారం ఉదయం ఆయన మృతి చెందిన విషయం తెలుసుకున్న వెంటనే వైఎస్సార్సీపీ నాయకులు గొల్లలగూడూరు గ్రామానికి చేరుకుని భౌతికకాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా వేముల మండల వైఎస్సార్సీపీ కన్వీనర్ నాగెళ్ళ సాంబశివారెడ్డి,జడ్పీటీసీ కొకటం బయపురెడ్డి,వైఎస్సార్సీపీ సీనియర్ నాయకులు చల్లా వెంకట నారాయణ,మాజీ పీసిబి చైర్మన్ మరకా శివకృష్ణారెడ్డిలు ప్రతాప్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అందులో భాగంగా వారు మాట్లాడుతూ... ప్రతాప్‌రెడ్డి అకాల మరణం ఎంతో బాధాకరమని,ఆయన మృతి కుటుంబ సభ్యులకు, పార్టీ శ్రేణులకు తీరని లోటని పేర్కొన్నారు. ప్రతాప్‌రెడ్డి అందరితో కలుపుగోలుగా ఉంటూ మంచి వ్యక్తిగా గుర్తింపు పొందారని తెలిపారు.ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ,ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని కుటుంబ సభ్యులకు భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. పలువురు వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రతాప్‌రెడ్డికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# దళితుల భూములకు రక్షణ కల్పించాలి..!

● అక్రమ పట్టాలు రద్దు చేసి 40 ఏళ్లుగా సాగు చేస్తున్న కుటుంబాలకు హక్కు పత్రాలు ఇవ్వాలి



**ఆస్పరి మన జనప్రగతి ఆగస్టు 06:-**ఆస్పరి మండలం కైరుప్పల గ్రామంలోని దళితుల సాగుభూములకు రక్షణ కల్పించి, అక్రమంగా మంజూరైన పట్టాలను రద్దు చేసి, గత 40 సంవత్సరాలుగా భూమిని సాగు చేసుకుంటున్న 12 దళిత కుటుంబాలకు హక్కు పత్రాలు మంజూరు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో గురువారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కైరుప్పల గ్రామంలోని సర్వే నంబర్ 578లో 12 దళిత కుటుంబాలు నాలుగు దశాబ్దాలుగా భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నప్పటికీ, వారికి పట్టాలు మంజూరు చేయకుండా రెవెన్యూ అధికారులు కాలయాపన చేశారని ఆరోపించారు. ఇదే సమయంలో ఆస్పరికి చెందిన రాజగోపాల్‌కు నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా పట్టాలు మంజూరు చేశారని, అనంతరం ఆ భూమిని బిల్లేకల్లు గ్రామానికి చెందిన ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ వెంకటేష్‌కు విక్రయించడం ద్వారా వివాదాలు సృష్టించి శాంతిభద్రతలకు భంగం కలిగిస్తున్నారని విమర్శించారు.అక్రమ పట్టాల ఆధారంగా దళిత కుటుంబాలను భూమి సాగు చేయకుండా అడ్డుకోవడం తీవ్ర అన్యాయమని పేర్కొంటూ, ఈ భూవ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే అక్రమ పట్టాలను వెంటనే రద్దు చేసి, 40 సంవత్సరాలుగా సాగు చేస్తున్న 12 దళిత కుటుంబాలకే పూర్తి భూహక్కు పట్టాలు మంజూరు చేయాలని ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు.డిమాండ్లు నెరవేర్చకపోతే ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరాహార దీక్షలు చేపట్టి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకుడు ఆర్. గురుదాసు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి కే. తిమ్మయ్య, డీహెచ్‌పీఎస్ తాలూకా అధ్యక్షుడు హెచ్. రంగన్న, నాయకులు ముద్దురంగుడు, బి.టెక్. బద్రి, దళిత సంఘం నాయకుడు దూదేకొండ మల్లయ్యతో పాటు బాధితులు రంగమ్మ, రామక్క, శ్రీదేవమ్మ, ఆదిలక్ష్మి, లక్ష్మమ్మ, గాయత్రి, లక్ష్మి, శారదమ్మ, ఆదెమ్మ, ఈరేశమ్మ తదితరులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వైద్యుల సేవలకు లయన్స్ ఎలైట్ ఘన సత్కారం



**కాకినాడ మన జనప్రగతి ఆగస్టు 06:-**సమాజానికి విశిష్ట వైద్య సేవలు అందిస్తున్న 11 మంది ప్రముఖ వైద్యులను వైద్యుల దినోత్సవం సందర్భంగా లయన్స్ ఎలైట్ క్లబ్ ఘనంగా సత్కరించింది. వారి వారి ఆసుపత్రులు, చాంబర్లలో శాలువాలు కప్పి జ్ఞాపికలు అందజేసి అభినందనలు తెలిపింది.ఈ సందర్భంగా క్లబ్ వ్యవస్థాపకులు, మాజీ జిల్లా గవర్నర్ ముంజులూరి విశ్వేశ్వరరావు మాట్లాడుతూ, వైద్య సేవలను గుర్తించి ప్రతి సంవత్సరం వైద్యులను సత్కరించడం తమ క్లబ్ సంప్రదాయమని తెలిపారు.క్లబ్ అధ్యక్షులు నేదునూరి అనంత రామలింగేశ్వర శర్మ, కార్యదర్శి సత్తి రవిరెడ్డి, సీనియర్ సభ్యులు మైలవరపు సత్యనారాయణ ఆధ్వర్యంలో డాక్టర్ కాదా వెంకటరమణ, డాక్టర్ రావుల శ్రీరామ్, డాక్టర్ ఎం.బి.ఆర్. శర్మ, డాక్టర్ వాడ్రేవు రవి, డాక్టర్ రామానంద రెడ్డి, డాక్టర్ శ్రీరామచంద్రుడు, డాక్టర్ హర్ష, డాక్టర్ జి.ఎస్.ఎన్. మూర్తి, డాక్టర్ ఉదయశంకర్, డాక్టర్ నిశాంత్, డాక్టర్ శంకర్‌లను ఘనంగా సత్కరించారు.డాక్టర్ కాదా వెంకటరమణ మాట్లాడుతూ, వైద్య సేవలతో పాటు విద్యాభివృద్ధికి స్కాలర్‌షిప్‌ల ద్వారా ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.డాక్టర్ రావుల శ్రీరామ్ మాట్లాడుతూ, కంటి ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు నేత్రదానాన్ని ప్రోత్సహించాలని కోరారు. డాక్టర్ వాడ్రేవు రవి మాట్లాడుతూ, అత్యాధునిక వైద్య సేవలను ప్రజలకు అందుబాటులో ఉంచడమే తమ లక్ష్యమన్నారు.కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి శివకుమార్, మండలిక శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

# ప్రాంగణ ఎంపికల్లో ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు ఉద్యోగాలు

- రూ 7లక్షల వార్షిక వేతనంతో కొలువులు



**వేంపల్లె మన జనప్రగతి ఆగస్టు 06:-**ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగాలు సాధించారు. ట్రిపుల్ ఐటీ లో గురువారం హైదరాబాదుకు చెందిన గ్రిడ్ లెక్స్ సాఫ్ట్వేర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో ఒక్కో విద్యార్థి రూ 7 లక్షల వార్షిక వేతనంతో కొలువులు దక్కించుకున్నారు. డైరెక్టర్ ఆచార్య గడ్డం విజయ ప్రకాష్, ఏవో రవి కుమార్ నేతృత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పలు రకాల రౌండ్లలో నిర్వహించిన ఎంపికల్లో ట్రిపుల్ ఐటీ కి చెందిన 9 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు మరింత మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు దేశంలోని ప్రముఖ ఐటీ కోర్ సంస్థలను క్యాంపస్ కు ఆహ్వానించి విద్యార్థులకు ఉద్యోగాలు వచ్చేలా చూస్తామన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను డైరెక్టర్, ఏవో తో పాటు ప్లేస్మెంట్ ఇన్చార్జి సత్యానందరావు అధికారి సుందర్ కెరియర్ డెవలప్మెంట్, ప్లేస్మెంట్ సెల్, ఇన్ఫ్రా బృందం అభినందించింది.

# కూటమి పాలన అధ్వానం,డీఎస్సీ అభ్యర్థులకు ఘోర అన్యాయం

పులివెందులలో వైకాపా ఆధ్వర్యంలో విద్యార్థుల రిలే నిరాహార దీక్ష

మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్

దీక్షకు సంఘీభావం తెలిపిన తొండూరు ఇన్చార్జి వైయస్ మదనమోహన్ రెడ్డి

కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై ధ్వజమెత్తిన మాజీ చైర్మన్ వరప్రసాద్




**పులివెందుల అర్బన్ మన జనప్రగతి ఆగస్టు 06:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పరిపాలన అధ్వానం గా తయారైందని విద్యార్థులను, నిరుద్యోగులను ఘోరంగా మోసం చేసిందని,డీఎస్సీ పేరుతో జరిగిన అన్యాయానికి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని మున్సిపల్ మాజీ చైర్మన్ వరప్రసాద్ డిమాండ్ చేశారు.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు గురువారం పులివెందుల ఆర్డీవో కార్యాలయం సమీపంలో వైకాపా ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి రిలే నిరాహార దీక్ష నిర్వహించారు.ఈ కార్యక్రమానికి తొండూరు మండల వైకాపా ఇంచార్జ్ వైయస్ మదనమోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై,దీక్షలో కూర్చున్న విద్యార్థులకు పూలమాలలు వేసి సంఘీభావం తెలిపారు. అంతకుముందు ఆయన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి,ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్ల అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వరప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.స్పోర్ట్స్ కోటాను అడ్డం పెట్టుకుని ఉద్యోగాలనుఅమ్ముకున్నారని,కష్టపడి మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు.నిరుద్యోగ భృతి ఏమైందని ప్రశ్నించిన ఆయన,విద్యార్థులు, మహిళలు,నిరుద్యోగులు సహా అన్ని వర్గాల ప్రజలను ప్రభుత్వం వంచించిందన్నారు.26 నెలల పాలనలో ప్రజలకు ఏమీ చేయకుండా కూటమి నాయకులు ఏ ముఖం పెట్టుకుని 'ఇంటింటికీ' తిరుగుతున్నారని నిలదీశారు.ఏమీ చేయలేకపోయినందుకు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు క్షమాపణ చెప్పాలని వ్యాఖ్యానించారు.రాష్ట్రంలో కూటమి పాలన పూర్తిగా అధ్వానంగా తయారైందని,పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతాంగం తీవ్ర అల్లాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శశికాంత్ రెడ్డి, బాబు రెడ్డి,భయపరెడ్డి, సాంబశివరెడ్డి,సర్వోత్తమ్ రెడ్డి,సారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి,అంబకపల్లినారాయణస్వామి,ఫైర్ రామకృష్ణ,మాజీ కౌన్సిలర్ నాగరాజు,ఆర్టీసీ జయరాములు,అంజన్నప్ప, కడియాలలక్ష్మీనారాయణ,కొంగనపల్లె మురళి,బ్యాటరీల ప్రసాద్,బాబయ్యతో పాటు పెద్ద సంఖ్యలో వైకాపా నాయకులు,కార్యకర్తలు,విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆలూరు ఎమ్మెల్యే బూసినె విరూపాక్షి అరెస్టును ఖండించిన వైఎస్సార్‌సీపీ నాయకులు



**దేవనకొండ మన జనప్రగతి ఆగస్టు 06:-**ఆలూరు ఎమ్మెల్యే బూసినె విరూపాక్షి అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ దేవనకొండ మండల కన్వీనర్ రామకృష్ణ (కిట్టు) తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతుకలను అణిచివేసే చర్యలు సరికావని ఆయన విమర్శించారు.చిప్పగిరి మండలం నేమకల్లు గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడి ఇంటిపై దాడి జరిగిన నేపథ్యంలో బాధిత కుటుంబానికి అండగా నిలవడానికి వెళ్లిన ఎమ్మెల్యే విరూపాక్షిపైనే కేసులు నమోదు చేసి అరెస్టు చేయడం అన్యాయమని అన్నారు. ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధి బాధితులను పరామర్శించడం నేరం కాదని, అధికార పార్టీ నాయకులకు ఒక న్యాయం, ప్రతిపక్ష నాయకులకు మరో న్యాయం అమలు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు.అన్యాయాలను ప్రశ్నించే వారిపై కేసులు నమోదు చేయడం, అర్ధరాత్రి అరెస్టులు చేయడం వంటి చర్యలతో వైఎస్సార్‌సీపీ వెనక్కి తగ్గదని, బాధితులకు అండగా నిలుస్తూ ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని రామకృష్ణ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు కిట్టు ప్రభాకర్ రెడ్డి, అబ్రహం, బద్రి, యువ నాయకులు అంజి, వీరేష్, మహేష్, దేవేంద్రప్ప, శ్రీనివాసులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీసీలపై టిడిపి,వైకాపాలది కపట ప్రేమ: మాజీ ఎంపీ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లె మన జనప్రగతి ఆగస్టు 06:-**బీసీ ల పట్ల టిడిపి,వైకాపా లది కపట ప్రేమయని, ఈ పార్టీల పాలనలో రాష్ట్రంలో బీసీ కార్పొరేషన్లు నేతి బీరకాయల చందంగా తయారయ్యాయని,బీసీల సాధికారత కోసం చిత్తశుద్ధితో కృషిచేసిన పార్టీ కాంగ్రెస్ ఒక్కటే అని రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు.గురువారం వేంపల్లి లో తులసి రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ 1970 జూలై 23వ తేదీన బీసీలకు విద్యా, ఉద్యోగాలలో 25 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కాసు బ్రహ్మానంద రెడ్డి ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ ప్రభుత్వం జీవో 1793 జారీ చేసిందన్నారు.అప్పటికి తెలుగుదేశం, వైకాపా జనసేన,బిజెపిపార్టీలు పుట్టనే లేదు. చంద్రబాబు రాజకీయాలలో ప్రవేశించలేదు. ఆ మాటకొస్తే జగనే పుట్టలేదు . ఈ రిజర్వేషన్ ద్వారా లక్షలాదిమంది బీసీలు ఉన్నత చదువులు చదివి, ఉద్యోగాలు పొంది,ఉన్నత జీవన ప్రమాణాలతో జీవిస్తున్నారు. 1993లో కోట్ల విజయభాస్కర్ రెడ్డి ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక ప్రభుత్వాలలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించిందన్నారు .దీని ద్వారా లక్షలాది మంది బీసీలు వార్డు మెంబర్లు, సర్పంచులు,,ఎంపీటీసీలు,మండల పరిషత్ అధ్యక్షులు,జడ్పిటిసిలు, జడ్పీ చైర్మన్లు, కౌన్సిలర్లు, మున్సిపల్ చైర్మన్లు, కార్పొరేటర్లు, మేయర్లు కాగలిగారన్నారు. 2008లో రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ పథకాలను ప్రారంభించిందన్నారు .దీనివలన బీసీ విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు పొందారు.కాంగ్రెస్ ప్రభుత్వాలు 1968 లో బీసీ కమిషన్,1974లో బీసీ కార్పొరేషన్,1975లో బీసీ డైరెక్టరేట్ను, 2006లో వడ్డెర కార్పొరేషన్ను,2009లో ఉప్పర,వాల్మీకి,పూసల,భట్రాజుల కార్పొరేషన్లను ఏర్పాటు చేసిందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వాలు బీసీ హాస్టల్లు,బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలు, బీసీ స్టడీ సెంటర్లను ఏర్పాటు చేశాయన్నారు .గొర్రెల బీమా పథకాన్ని ప్రారంభించింది.మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి,వర్ధంతి కార్యక్రమాలను అధికారపురకంగా నిర్వహించాలని కాంగ్రెస్ పాలనలోనే జీవోలు జారీ చేయడం జరిగిందన్నారు .బీసీల ఛాంపియన్లము మేము అంటే మేము అని టిడిపి,వైకాపా పార్టీలు డబ్బు వాయించుకోవడం హాస్యాస్పదమన్నారు.

# ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రైతులు అప్రమత్తంగా ఉండాలి

● శాస్త్రీయ పద్ధతులు పాటిస్తే పంట నష్టాలను తగ్గించుకోవచ్చు



**తొండూరు మన జనప్రగతి ఆగస్టు 06:-**ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడుతున్న నేపథ్యంలో రైతులు పంటల సాగులో ముందస్తు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. శాస్త్రీయ పద్ధతులను అనుసరించడం ద్వారా పంట నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు.కృషి విజ్ఞాన కేంద్రం, ఏరువాక కేంద్రం ఊటుకూరు (కడప), వ్యవసాయ కళాశాల పులివెందుల, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో తొండూరు మండలంలోని ఇనగనూరు, మల్లేల గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ తక్కువ కాలంలో దిగుబడినిచ్చే ప్రత్యామ్నాయ పంటల సాగు, నేలలో తేమ సంరక్షణ పద్ధతులు, పురుగుల నివారణ చర్యలపై రైతులకు వివరించారు. నీటి వినియోగాన్ని తగ్గిస్తూ బిందు సేద్యం, పంట అవశేషాలతో మల్చింగ్, నేల పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం చేపట్టాలని సూచించారు.ఇనగనూరు గ్రామంలో సాగులో ఉన్న వేరుశనగ, పత్తి పంటలను శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటల్లో తేమ లోపం, పురుగుల సమస్యలను గుర్తించి రైతులకు తగిన సూచనలు అందించారు.వేరుశనగ, పత్తి పంటల్లో పురుగుల నియంత్రణకు సిఫారసు చేసిన మందులను సరైన మోతాదులో మాత్రమే వినియోగించాలని, పంటల అభివృద్ధికి అవసరమైన పోషక యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. ఉద్యాన పంటల్లో తెగుళ్ల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని రైతులకు వివరించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ కృష్ణప్రియ, డాక్టర్ మానస, డాక్టర్ సాయి మహేశ్వరి, డాక్టర్ మహేష్ బాబు, గిరీష్ కుమార్, వ్యవసాయ కళాశాల పులివెందుల అధ్యాపకులు, వ్యవసాయ అధికారులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# తల్లిపాలే శిశువుకు అమృతం

- ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు హేమలత




**పులివెందుల, మన జనప్రగతి, ఆగస్టు 06:-** ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా వైఎస్ఆర్ కడప జిల్లా పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని గుంతబజార్ స్వర్ణ వార్డులో ఉన్న ఇస్లాంపురం అంగన్‌వాడీ కేంద్రాలు-1, 2లో గురువారం తల్లిపాల వారోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు బి. హేమలత మాట్లాడుతూ, పుట్టిన శిశువుకు గంటలోపే ముర్రుపాలు పట్టించడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యవంతమైన ఎదుగుదల సాధ్యమవుతుందని తెలిపారు. శిశువుకు తొలి ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, రోజుకు అవసరాన్ని బట్టి 8 నుంచి 12 సార్లు పాలివ్వాలని సూచించారు.తల్లిపాల వల్ల శిశువుల్లో రోగనిరోధక శక్తి, మెదడు ఎదుగుదల మెరుగుపడటంతో పాటు తల్లులు కూడా త్వరగా కోలుకుని రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ వంటి వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చని చెప్పారు. పాలిచ్చే తల్లులు తగినంత నీరు తాగడంతో పాటు ఆకుకూరలు, కూరగాయలు, పాలు, పండ్లు, ధాన్యాలు, కోడిగుడ్లు వంటి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గుంతబజార్ సచివాలయ వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీ ఎన్. రాధ సుప్రియ, మహిళా సంరక్షణ కార్యదర్శి ఆర్. నందిని, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం. లక్ష్మీదేవి, ఎస్. శివరాజేశ్వరి, ఈ. భానుభి, లావణ్య, అంగన్‌వాడీ సహాయకులు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

# రూ. 45.74 లక్షల సీఎం సహాయక నిధి చెక్కుల పంపిణీ

**ఆళ్లగడ్డ మన జనప్రగతి, ఆగస్టు 06:-** పట్టణంలోని ఎమ్మెల్యే స్వగృహంలో గురువారం సీఎం సహాయక నిధి కింద మంజూరు అయిన 46 మందికి 45,74,226, రూపాయల విలువ గల సీఎం సహాయక నిధి చెక్కులను ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నియోజకవర్గ ప్రజల అభివృద్ధికి పాటుపడుతోందన్నారు. చెక్కులు తీసుకున్న అనంతరం బాదిత కుటుంబసభ్యులు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంజూరు చేసిన సీఎం నారా చంద్రబాబు నాయుడుకు, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు ధన్యవాదములు తెలిపారు.

# 2025 డీఎస్సీ నియామకాలపై సీబీఐ విచారణ చేపట్టాలి: మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

**పత్తికొండ మన జన ప్రగతి ఆగస్టు 06:**–వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు చేపడుతున్న రిలే నిరాహార దీక్షలకు సంఘీభావం తెలిపిన మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ 2025 డీఎస్సీ నియామకాల ప్రక్రియలో చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్న అక్రమాలు,అవకతవకలపై వెంటనే సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ డిమాండ్ చేశారు. వేలాది మంది నిరుద్యోగ యువత భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఈ అంశంపై ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించి, వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని కోరారు. డీఎస్సీ నియామకాలపై సీబీఐ విచారణకు ప్రభుత్వం సిద్ధపడకపోతే,ఈ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు న్యాయం జరిగే వరకు వైఎస్సార్‌సీపీ వారి పక్షాన నిలబడి పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని హెచ్చరించారు.పత్తికొండలో డీఎస్సీ నియామకాలపై సమగ్ర విచారణ జరిపి బాధిత అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు నాలుగు రోజుల పాటు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు.ఈ దీక్షల్లో డీఎస్సీలో




నష్టపోయిన నిరుద్యోగ యువతతో కలిసి మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ పాల్గొని వారికి సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా కంగాటి శ్రీదేవమ్మ మాట్లాడుతూ.. ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి కష్టపడి చదివి, డీఎస్సీ కోసం ఎంతో ఆశతో ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు అన్యాయం జరిగితే వారి భవిష్యత్తుకు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. డీఎస్సీ నియామకాలపై వస్తున్న ఆరోపణలను ప్రభుత్వం తేలికగా తీసుకోకుండా,నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.కొడుకు చేసిన తప్పును వెనకేసుకుని రాకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజ్ఞతతో వ్యవహరించి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తో రాజీనామా చేయించాలని కంగాటి శ్రీదేవమ్మ డిమాండ్ చేశారు.బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న మంత్రి తన శాఖకు సంబంధించిన ఆరోపణలపై ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు.అదే విధంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిరుద్యోగ యువతకు జరిగిన అన్యాయంపై నోరు విప్పి మాట్లాడాలని డిమాండ్ చేశారు. యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు, డీఎస్సీ నియామకాలపై పూర్తి స్థాయి విచారణ జరిపించి అర్హులైన అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు.నిరుద్యోగ యువత న్యాయం కోసం చేస్తున్న పోరాటాన్ని ప్రభుత్వం అణచివేయాలని చూస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు వైఎస్సార్‌సీపీ వారి పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తుందని కంగాటి శ్రీదేవమ్మ స్పష్టం చేశారు. నిరుద్యోగులకు న్యాయం చేయాలి.. డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరపాలి..అర్హులైన అభ్యర్థులకు న్యాయం చేయాలి అని తెలియజేశారు.ఈ దీక్షలో పత్తికొండ నియోజకవర్గ నాయకులు, మండల నాయకులు పాల్గొన్నారు.

# గిరిజనుల హక్కుల పరిరక్షణకు చట్టబద్ధ పరిష్కారం చూపాలి

**● కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు వైఎస్సార్‌సీపీ ఎంపీల వినతి**



**న్యూఢిల్లీ/పులివెందుల అర్బన్ మన జనప్రగతి ఆగస్టు 06:** గిరిజనుల విద్య,ఉద్యోగ,ఉపాధి హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా జీవో నెం.3 స్థానంలో ప్రత్యామ్నాయ చట్టబద్ధ వ్యవస్థను అమలు చేయాలని వైఎస్సార్‌సీపీ ఎంపీల బృందం కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. గురువారం న్యూఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్ షాను అరకు ఎంపీ డాక్టర్ గుమ్మ తనూజ రాణి,రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి,మేడా రఘునాథ్ రెడ్డి,గొల్ల బాబూరావులతో పాటు లోక్‌సభ సభ్యులు పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి,వైఎస్ అవినాష్ రెడ్డి,మద్దిల గురుమూర్తి కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా అరకు ఎంపీ డాక్టర్ గుమ్మ తనూజ రాణి మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లోని జీవో నెం.3, 1/70 చట్టానికి సంబంధించిన అంశాలను,గిరిజన ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితులను కేంద్ర ప్రభుత్వం సమగ్రంగా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.గిరిజనుల రాజ్యాంగబద్ధ హక్కుల పరిరక్షణకు,వారికి సరైన న్యాయం జరిగేలా తగిన చట్ట సవరణలు చేస్తూ తక్షణమే ప్రత్యామ్నాయ చట్టబద్ధ పరిష్కారాన్ని చూపాలని ఆమె కేంద్ర హోంమంత్రిని కోరారు.

# స్వచ్ఛ గ్రామాల సాధనకు అధికారుల సమిష్టి కృషి అవసరం..!

**● గ్రామాల్లో స్వచ్ఛతపై విస్తృత అవగాహన కల్పించాలి**

**● పులివెందుల డివిజనల్ డెవలప్మెంట్ అధికారి వెంకట సుబ్బయ్య**




**వేముల మన జనప్రగతి ఆగస్టు 06:**–స్వచ్ఛ గ్రామాలే ఆరోగ్యకర సమాజానికి పునాది అని,గ్రామాలను వంద శాతం బహిరంగ మలవిసర్జన రహితంగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమిష్టిగా కృషి చేయాలని పులివెందుల డివిజనల్ డెవలప్మెంట్ అధికారి వెంకట సుబ్బయ్య పిలుపునిచ్చారు. గ్రామాల్లో వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తూ ప్రభుత్వ మార్గదర్శకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.గురువారం ఉదయం వేముల మండల కేంద్రంలోని స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ) ఆధ్వర్యంలో గ్రామస్థాయిలో నియమ నిబంధనల అమలు, వ్యక్తిగత మరుగుదొడ్ల (ఐహెచ్‌హెచ్ఎల్) వినియోగంపై ప్రజల్లో చైతన్యం పెంపొందించడం, వంద శాతం బహిరంగ మలవిసర్జన నిర్మూలన లక్ష్యంగా మండలంలోని పంచాయతీ అభివృద్ధి అధికారులు (పీడీవోలు), ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ...ప్రతి గ్రామంలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛత కార్యక్రమాలను విజయవంతం చేయాలని తెలిపారు. గ్రామాల్లో మరుగుదొడ్ల వినియోగంపై నిరంతర ప్రచారం నిర్వహించి,ప్రతి కుటుంబం వాటిని వినియోగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎం.శారదమ్మ,డిప్యూటీ ఎంపీడీవోలు కుమార్ రంగయ్య, మండలంలోని పీడీవోలు,ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు

# పిఎండిఎస్ పంటల సాగు ద్వారా రైతుకు ఆదాయం: జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి.

**కర్నూలు బ్యూరో మన జనప్రగతి ఆగస్టు 06:**–పిఎండిఎస్ పంటల సాగు ద్వారా రైతుకు ఆదాయం వస్తుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి పేర్కొన్నారు.దేవనకొండ మండలం కప్పట్రాల గ్రామపంచాయతీ ఈదుల దేవరబండ గ్రామంలో రైతు రాముడు తన 3 ఎకరాల్లో పొలంలో పీఎండీఎస్ విధానం ద్వారా చేపట్టిన పంటల సాగును మరియు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి మరియు జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు రాముడు మూడు ఎకరాల భూమిలో రెండు ఎకరాలకు డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటు చేసి, బోరు నీరు తక్కువగా ఉన్నప్పటికీ సమర్థవంతంగా వినియోగిస్తూ బెండ ,ఆముదం, చిక్కుడు, బీట్‌రూట్,బీరకాయలు,వంకాయి,టమాటా ,క్యారెట్, ముల్లంగి,మొక్కజొన్న , తోటకూర, పెసలు, మినుములు, కొత్తిమీర,పాలకూర , గోంగూర తదితర 18 రకాల పంటలను సాగు చేస్తున్నారని కలెక్టర్ తెలిపారు. ఈ పంటలు నాటి నెలరోజులు పూర్తికాగా, గత 15 రోజులుగా ఆకుకూరల విక్రయం ద్వారా రోజుకు సుమారు రూ.1,000 నుంచి రూ.1,500 వరకు ఆదాయం పొందుతున్నారని కలెక్టర్



పేర్కొన్నారు. త్వరలో టమాటా, వంకాయ, బీరకాయ, అలసంద వంటి పంటలు కూడా దిగుబడికి సిద్ధమవుతున్నాయని, దీంతో మరో రెండు నుంచి మూడు నెలల పాటు రైతుకు రోజువారీ ఆదాయం లభించే అవకాశం ఉందన్నారు. ఈ విధానం రైతుల కుటుంబ అవసరాలను తీర్చడమే కాకుండా అప్పుల భారం తగ్గించడంలోనూ తోడ్పడుతుందన్నారు. జిల్లాలో రైతులు ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ విధానాన్ని విస్తృతంగా అమలు చేసి, బహుళ పంటల సాగు ద్వారా స్థిరమైన ఆదాయాన్ని పొందాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.పీఎండీఎస్ విధానంలో బహుళ పంటల సాగు చేపట్టడం వల్ల తక్కువ నీటితోనే అధిక ప్రయోజనం పొందవచ్చని, వర్షపు నీరు భూమిలో ఇంకి భూగర్భ జలాలు పెరగడంతో పాటు నేల సారవంతం మెరుగుపడుతుందని కలెక్టర్ వివరించారు. వివిధ పంటల వేర్ల వ్యవస్థల కారణంగా నేలలో సూక్ష్మజీవుల పెరుగుదల కూడా అధికమవుతుందన్నారు. అదే విధంగా పీఎండీఎస్ విధానంలో సాగు చేసిన మొక్కజొన్న పంటలో సాధారణంగా ఒకే కంకి వచ్చే చోట నాలుగు కంకులు రావడం వంటి మెరుగైన ఫలితాలు ఆశ్చర్యానికి గురి చేసాయన్నారు. రైతులందరూ ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ విధానాన్ని అనుసరించి 18 నుంచి 20 రకాల విత్తనాలతో బహుళ పంటల సాగు చేపట్టి,స్థిరమైన ఆదాయంతో పాటు నేల ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుచుకోవాలని కలెక్టర్ రైతులకు సూచించారు.అనంతరం హాఫ్ మూన్ మోడల్ లో పీఎండీఎస్ విధానం ద్వారా ఆముదం,అలసందలు, తదితర విత్తనాలను రాముడు పొలంలో కలెక్టర్ ,జాయింట్ కలెక్టర్ విత్తనాలు నాటారు.కార్యక్రమంలో నాచురల్ ఫార్మింగ్ అధికారి మాధురి,డి ఎల్ ఎఫ్ పి లక్ష్మయ్య పాల్గొన్నారు.

# తల్లిపాలపై అవగాహన పెంపొందించాలి..!

**ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి**

**వేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇన్‌చార్జి వైద్యాధికారి డాక్టర్ సుభాషిణి**



**వేముల మన జనప్రగతి ఆగస్టు 06:**–శిశువుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రతి తల్లికి అవగాహన కల్పించడం ఎంతో అవసరమని వేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇన్‌చార్జి వైద్యాధికారి డాక్టర్ సుభాషిణి అన్నారు.జననం నుంచి ఆరు నెలల వరకు శిశువుకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని ఆమె సూచించారు.ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా వేముల మండలంలోని బెస్తవారిపల్లి అంగన్వాడీ కేంద్రంలో వేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ సుభాషిణి మాట్లాడుతూ...పుట్టిన వెంటనే శిశువుకు ముర్రుపాలు ఇవ్వడం అత్యంత అవసరమని, అవి తొలి టీకాతో సమానమైన రోగనిరోధక శక్తిని అందిస్తాయని తెలిపారు. తల్లిపాలు శిశువు శారీరక, మానసిక ఎదుగుదలకు ఎంతో దోహదపడతాయని చెప్పారు.ఆరు నెలల తర్వాత శిశువుకు తల్లిపాలతో పాటు అదనపు పోషకాహారం అందించాలని, పాలిచ్చే తల్లులు పోషక విలువలు అధికంగా ఉండే ఆహారం తీసుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు.తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లి, బిడ్డ ఇద్దరికీ కలిగే ఆరోగ్య ప్రయోజనాలను గర్భిణులు, బాలింతలకు వివరించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి ఎ.ఉషారాణి,మహిళా హెల్త్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, అంగన్వాడీ టీచర్ వసుధ,హెల్త్ అసిస్టెంట్ నవనీత,ఆశా కార్యకర్త లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

# 'జల్ జీవన్ మిషన్' ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో 72.11 లక్షల గ్రామీణ కుటుంబాలకు తాగునీటి కనెక్షన్లు

**పవన్ కళ్యాణ్ చొరవతో ఏపీలో 2028 వరకు 'జల్ జీవన్ మిషన్' పొడిగింపు**

**కాకినాడ ఎంపీ తంగెళ్ల ప్రశ్నకు కేంద్ర జలశక్తి శాఖ మంత్రి లిఖితపూర్వక సమాధానం**

**కాకినాడ మన జనప్రగతి ఆగస్టు 06:**–జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటివరకు 72.11 లక్షల (75.48 శాతం) గ్రామీణ కుటుంబాలకు సురక్షిత తాగునీటి కనెక్షన్లు అందించామని, మిగిలిన కుటుంబాలకు కూడా దశలవారీగా తాగునీటి సౌకర్యం కల్పించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సి.ఆర్. పాటిల్ వెల్లడించారు. గోదావరి వాటర్ గ్రిడ్ (అమరజీవి జలధార) ప్రాజెక్టుకు కేంద్ర సహాయం, ప్రాజెక్టు పురోగతి, కాకినాడతో పాటు గోదావరి ప్రాంత ప్రజలకు సురక్షిత తాగునీటి కల్పనపై కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.కేంద్ర ప్రభుత్వం 2019 ఆగస్టు నుంచి రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి జల్ జీవన్ మిషన్ హర్ ఘర్ జల్ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. ఈ పథకం ప్రారంభమైన సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో కేవలం 30.74 లక్షల (32.18 శాతం) గ్రామీణ కుటుంబాలకు మాత్రమే



నల్లా కనెక్షన్లు ఉండగా, ప్రస్తుతం 72.11 లక్షల (75.48 శాతం) కుటుంబాలకు సురక్షిత తాగునీటి కనెక్షన్లు కల్పించినట్లు పేర్కొన్నారు.ఈ ప్రయోజనం కాకినాడతో పాటు గోదావరి ప్రాంతంలోని ఇతర జిల్లాలకు కూడా అందుతోందని వెల్లడించారు.ఈ సందర్భంగా ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించడం కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఈ అంశాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావించి కేంద్ర ప్రభుత్వం నుంచి సమగ్ర సమాచారాన్ని సేకరించడం ద్వారా ప్రజలకు వాస్తవ పరిస్థితిని తెలియజేయగలిగామని పేర్కొన్నారు.గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ అమలును నిర్లక్ష్యం చేయడంతో పాటు కేంద్రం కేటాయించిన నిధులను సమర్థవంతంగా వినియోగించకపోవడం వల్ల రాష్ట్రంలో ఈ పథకం నీరుగారి పోయిందన్నారు.అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవ తీసుకుని ఆంధ్రప్రదేశ్‌లో జల్ జీవన్ మిషన్ పథకాన్ని కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారని తెలిపారు. ఆయన విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది నుండి ' జల్ జీవన్ మిషన్ 2.0' ను తిరిగి అమలు చేయడంతో పాటు పథకాన్ని 2028 డిసెంబర్ వరకు పొడిగించడం రాష్ట్ర ప్రజలకు ఎంతో ప్రయోజనకరమని ఎంపీ పేర్కొన్నారు.రాష్ట్రంలోని ప్రతి గ్రామీణ కుటుంబానికి స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు అందే వరకు తన వంతు కృషిని పార్లమెంట్‌లో నిరంతరం కొనసాగిస్తానని ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ స్పష్టం చేశారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174